హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.128	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 । కనిష్ఠం 17.6

పల్లెకు వెలుగులేవీ?



రాత్రివేళ బస్సులేవీ?

» 80శాతం గ్రామాలకు నిలిచిన సేవలు

» గతంలో నడిచిన రూట్లలో ఆదాయం లేదంటూ నిలిపివేత

» ఆటోలే ప్రయాణికులకు దిక్కు

» రాత్రి 9.30 దాటితే హైదరాబాద్ నుంచి నల్లగొండ, యాదాద్రికి బస్సులు నిల్

ఉమ్మడి జిల్లాలో పదేళ్ల క్రితం వరకు చివరి గ్రామాలకు నైట్‌హాల్ట్ బస్సు ఉండేది. ప్రతీ ఆర్టీసీ డిపో నుంచి కనీసం 20 రూట్లలో ఇవి కొనసాగేవి. మారుమూల, సరిహద్దు ప్రాంతాలకూ ఈ బస్సు సర్వీసులుండేవి. ఉమ్మడి జిల్లాలోని ప్రతీ గ్రామానికి ఉదయం 10గంటలలోపు, సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్య బస్సులు అందుబాటులో ఉండేవి. డీజిల్ ధరల పెంపు, మరోవైపు ఆటోల తాకిడి, ప్రైవేట్ వాహనాల వినియోగం పెరగడం, ఆర్టీసీలో డ్రైవర్ల నియామకాలు లేకపోవడం తదితర కారణాలతో ప్రధానంగా పల్లెలకు వెళ్లే బస్సుల నిర్వహణ ఆర్టీసీకి భారంగా మారింది. దీంతో కొన్ని రూట్లలో బస్సులు నడిపితే నష్టాలు వస్తుండడంతో క్రమంగా సర్వీసుల సంఖ్యను తగ్గించింది. కరోనా అనంతరం సర్వీసులనే రద్దు చేసింది. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులవెంట ఉన్న గ్రామాలకు మాత్రమే రెగ్యులర్ బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. 80శాతం పల్లెలకు ఆర్టీసీ బస్సులే వెళ్లడం లేదు. ఒకప్పుడు ఏడిపో నుంచైనా రాత్రి 8గంటల వరకు నైట్‌హాల్ట్ బస్సులు అందుబాటులో ఉంటే, ప్రస్తుతం చీకటి పడితే బస్సు దొరకడం లేదు. తాజాగా, ఏడాది కాలంగా మహిళలకు ఉచితప్రయాణం కల్పిస్తుండటంతో పల్లెల్లో ఆర్టీసీ బస్సులకు డిమాండ్ పెరిగింది. అయితే డిమాండ్‌కు తగ్గట్టు బస్సులను పెంచలేకపోతుండడంతో ఇటీవల ఆమేరకు విన్నపాలు పెరిగాయి. ఈపరిస్థితిలో 80శాతం పల్లెలకు బస్సు లు వెళ్లని పరిస్థితిపై అధ్యయనం చేయాలని, ఈ రూట్లలోనూ నిర్ణీత బస్సులనైనా నడపాలని, పెద్దబస్సుల స్థానంలో మినీ, ఎలక్ట్రిక్‌బస్సులు ప్రవేశపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నల్లగొండ జిల్లాలో ఇలా..

నార్కట్‌పల్లి నుంచి బ్రాహ్మణవెల్లంల మీదుగా మునుగోడు వరకు ఉదయం, సాయంత్రం బస్సులు నడిచేవి. ఏళ్లుగా ఈ రూట్లో బస్సులు నిలిపేశారు. దీంతో ఈ రూట్లో వెళ్లే ప్రయాణికులు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు.

● నల్లగొండ డిపో నుంచి కట్టంగూరు మండలం పిట్టంపల్లి-ఇస్మాయిల్‌పల్లి-పామనగుండ్ల-ఎరసానిగూడెం బస్సు గతంలో రెండు పూటలా వచ్చేది. కరోనా తరువాత నుంచి ఈ బస్సు నడవడం లేదు. కట్టంగూరు-కురుమూర్తి-గార్లబాయిగూడెం-చెరువుఅన్నారం-నకిరేకల్‌కు గతంలో బస్సు ఉండేది. దీన్ని రద్దుచేయడంతో ఈ ప్రాంత ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కట్టంగూరు-కలిమెర-పరడ-అమ్మనబోలు-నక్కలపల్లి బస్సు గతంలో సౌకర్యవంతంగా ఉండేది. దీన్ని రద్దుచేయడంతో ఆటోలే దిక్కయ్యాయి.

● కేతేపల్లి మండలంలో జాతీయరహదారిపై ఉన్న ఉప్పలపాడు, చీకటిగూడెం, కేతేపల్లి, కొర్లపాడు, ఇనుపాముల గ్రామాలకు, సూర్యాపేట-మిర్యాలగూడ మార్గంలోని భీమారానికి తప్ప ఈ మండలంలో ఇతర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో కొప్పోలు-భీమారం-చెరుకుపల్లి మీదుగా సూర్యాపేట-మిర్యాలగూడ పట్టణాల మధ్య బస్సు సర్వీసులుండేవి. సూర్యాపేట-మిర్యాలగూడ వయా భీమారం రూట్లో మూసీ వంతెన నిర్మాణం తర్వాత కొప్పోలు-తుంగతుర్తి-చెరుకుపల్లి మీదుగా మిర్యాలగూడ వెళ్లే బస్సులను ఆరేళ్ల క్రితం రద్దు చేశారు. మెజార్టీ గ్రామాలకు బస్సు సదుపాయం లేదు.

● శాలిగౌరారం మండలంలో దాదాపు 35 గ్రామాలు ఉన్నాయి. గతంలో ఉన్న బస్సులను కరోనా సమయంలో రద్దు చేయడంతో

- మిగతా 7వ పేజీలో...

హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే బస్సులు ఏవైనా రాత్రి 9 గంటల తర్వాత నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ బస్టాండ్లలోకి రాకుండా బైపాస్ నుంచి నేరుగా వెళ్లిపోతున్నాయి. రాత్రి 9.30గంటలకు హైదరాబాద్-కోదాడ బస్సు వెళ్లాక హైదరాబాద్-చౌటుప్పల్-చిట్యాల-నార్కట్‌పల్లి-నల్లగొండ-మిర్యాలగూడ మార్గంలో ఏపీ బస్సులు మినహా తెలంగాణ డిపోల బస్సులు నడవడం లేదు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. లేదంటే తెల్లవారు జామున 3.30గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఇదే రూట్‌లో హైదరాబాద్ వెళ్లాలంటే అదే పరిస్థితి నెలకొంది. పలుమార్లు ప్రయాణికులకు, ఏపీ బస్సుల డ్రైవర్లు, కండక్టర్ల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు కూడా జరిగాయి. రాత్రి 10గంటలకు ఈ మార్గంలో కనీసం ఒక్కో బస్సునైనా నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

రాత్రి వేళ ప్రయాసే

యాదాద్రి జిల్లాలోని బీబీనగర్, భువనగిరి, యాదగిరిగుట్ట మార్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జూబ్లీ బస్టాండ్ నుంచి రాత్రి 8గంటల తర్వాత వచ్చే జనగాం, తొర్రూరు, వరంగల్, హనుమకొండ బస్సులు భువనగిరి పట్టణంలోనికి రాకుండా బైపాస్ నుంచి వెళ్లిపోతున్నాయి. దీంతో భువనగిరి ప్రయాణికులకు రాత్రి వేళ పట్నం నుంచి రావాలంటే ప్రయాస పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల ప్రయాణికులు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పరిశీలించిన తర్వాత ఆర్టీసీ అధికారులకు బస్సు సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇంకా కార్యాచరణ మాత్రం అమలు కాలేదు.

బస్సుల కోసం డిమాండ్ పెరిగింది



నల్లగొండ రీజియన్‌లో గత ఏడాది కాలంగా ప్రధానంగా మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చాక గ్రామీణ రూట్లలో బస్సులు నడపాలనే డిమాండ్ ఎక్కువైంది. ప్రైవేట్ వాహనాల వినియోగం, డీజిల్ ధరలు పెరగడం, కేవలం విద్యార్థులు మాత్రమే వినియోగిస్తున్న నేపథ్యంలో కరోనాకు ముందు పలు మార్గాల్లో ఆర్టీసీ బస్సులకు ఆదరణ తగ్గి పూర్తినష్టాలు రావడంతో సర్వీసులు నిలిచాయి. కరోనా వల్ల మరికొన్ని సర్వీసులు ఆగాయి. అయితే ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టాక బస్సు ప్రయాణాలు పెరిగాయి. అదే క్రమంలో పల్లె రూట్లలో బస్సులు నడపాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌ను మేం ప్రభుత్వానికి నివేదించాం. కొత్త బస్సులు వస్తున్నా, ఇంకా కొత్త రూట్లలో ప్రవేశపెట్టేస్థాయిలో సరిపోవడం లేదు. పాత బస్సులను తొలగించి వాటి స్థానంలోనే కొత్త బస్సులు వస్తున్నాయి. ప్రజల డిమాండ్ మేరకు క్రమేపీ బస్సులు పెంచుకుంటూ వెళతాం. హైదరాబాద్ నుంచి ఇటు నల్లగొండకు, అటు యాదాద్రి జిల్లాకు రాత్రివేళ 9.30గంటల తర్వాత సర్వీసులు ఉండడం లేదనే సమస్యను పరిష్కరిస్తాం. శీతాకాలం ముగిశాక రాత్రి 10గంటల వరకకు బస్సు సర్వీసులు హైదరాబాద్ నుంచి ఈ రెండు జిల్లాలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతాం.

- జానిరెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, నల్లగొండ

ఉ..హు..హూ..

» నాలుగు రోజులుగా తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

» 17.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు » వణికిస్తున్న చలి



నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చలి పులి వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. నాలుగు రోజులుగా 24 గంటలూ చల్లటి వాతావరణం ఉంటుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధుల పరిస్థితి దయనీయంగా ఉంది. చల్లటి గాలుల కారణంగా మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లలనే వారు కూడా ఎండ వచ్చాకే ఇంటి బయటికి వస్తున్నారు. చాలా మంది పనులున్న వారు కూడా చల్లటి గాలులకు బయటికి వెళ్లలేకపోతున్నారు. ఆదివారం 17.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చలి గాలులతో చాలా మంది జ్వరాలు, ఒంటి నొప్పులతో పాటు శ్వాస సంబంధిత వ్యాధులు, ముక్కు, చెవి, గొంతు నొప్పులతో బాధపడుతున్నారు. చలి తీవ్రత అధికంగా ఉండటంతో వ్యాయామం, వాకింగ్ తగ్గి మధుమేహం, బీపీ బాధితులు ఇబ్బంది పడుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పలువురు చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంటుండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
12	28.5	19.4
13	29.0	19.0
14	28.0	18.0
15	27.5	17.6

గ్రూప్-2 తొలిరోజు పరీక్షలు ప్రశాంతం



నల్లగొండలో అభ్యర్థులను తనిఖీచేసి అనుమతిస్తున్న సిబ్బంది

నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 తొలి రోజు పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో ఏర్పాటు చేసిన 87 కేంద్రాల్లో పరీక్షలు కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని రామగిరిలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలాత్రిపాఠి తనిఖీచేశారు. కేటాయించిన అభ్యర్థులు, హాజరు, గైర్హాజరైన అభ్యర్థుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షల సందర్భంగా జిల్లాలో ఎలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. పరీక్షల సందర్భంగా పోలీస్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులకు కేటాయించిన విధులను తప్పకుండా నిర్వహించాలన్నారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు.

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

(మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ తెలిపారు. ఆదివారం పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. 28 కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా సాగాయన్నారు. అదేవిధంగా తహసీల్దార్ హరిబాబు, రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరమణ, రూట్ ఆఫీసర్లు బాలునాయక్, ధర్మానాయక్, శివకుమార్, నాగరాజు తదితరులు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు.

ఆలస్యంగా రావడంతో..

గ్రూప్-2 పరీక్షకు ఆలస్యంగా వచ్చిన ఏడుగురు అభ్యర్థులను అధికారులు వెనక్కు పంపారు. కమిషన్ నిబంధనల మేరకు గ్రూప్ పరీక్షలకు నిమిషం నిబంధన అమలులో ఉండగా, మిర్యాలగూడ మినా కళాశాల పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు అనుమతించలేదు.



కాకతీయ డిగ్రీ కళాశాలలో పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నేటి నుంచి సీఎం కప్ క్రీడలు



మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి మాట్లాడుతూ, ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 16న ఉదయం 10.30గంటలకు కబడ్డీ పోటీలతో టోర్నమెంట్ ప్రారంభమవుతుందని తెలిపారు. క్రీడాకారులు 9.30గంటలకే హాజరు కావాలని కోరారు. 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు 20 క్రీడాంశాల్లో వివిధ స్టేడియాల్లో వేర్వేరుగా పోటీలు సాగుతాయని తెలిపారు.

నీలగిరి అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ?

రామగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. 2023-24లో ఐటీహబ్, వల్లభరావు చెరువు, సమీకృత మార్కెట్, పార్కులు, మెడికల్ కళాశాల, ప్రధాన రోడ్లు, జంక్షన్లు తదితర అభివృద్ధి పనులను సుమారు రూ.700కోట్లతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టారు. ఈ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గత ఏడాది విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను మునిసిపల్ అధికారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ రికార్డుల ఆధారంగా వివిధ అభివృద్ధి పనుల అగ్రిమెంట్లు, పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో రెండు రోజులుగా విచారిస్తున్నట్ట తెలిసింది. ఈ విచారణ మరో వారం రోజుల పాటు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి నివేదించనున్నట్టు సమాచారం.

రైతాంగ పోరాటాలను అణచివేస్తున్న కేంద్రం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగిస్తున్న పోరాటాలను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఢిల్లీలో రైతులు సాగించిన పోరాటాల ఫలితంగా కేంద్రం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసేలా కేంద్రం రైతులు సాగిస్తున్న ఉద్యమాన్ని నీరుగార్చేలా కుట్రలు చేస్తోందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి మద్దతు ధరల చట్టం అమలు చేయాలని, ఉపాధిహామీ పథకం పనిదినాలు పెంచి దినసరి వేతనాలను పెంచాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా, రుణమాఫీ రైతులందరికీ వర్తింపచేయాలని, పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, రేషన్‌కార్డులు, పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పతాని శ్రీను, జూకూరి నాగయ్య, అయితగాని విష్ణు, గడగోజు వెంకటాచారి, శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షకులు

నల్లగొండ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆరో రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజు మాట్లాడుతూ, విద్యాశాఖలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులుగా 19,300 మంది, జిల్లాలో 1,100 మంది వివిధ విభాగాల్లో 20 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. విద్యాశాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నా, సరైన వేతనాలు ఇబ్బంది పడుతున్నామన్నారు. గతంలో సీఎం ఇచ్చిన మాటకు కట్టుబడి తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్, కార్యదర్శి కంచర్ల మహేందర్, డి.నీలాంబరి, కొండ చంద్రశేఖర్, గుమ్మల మంజులారెడ్డి, సావిత్రి, వి.సావిత్రి, పుష్పలత, చౌడోజు శ్రీధర్, సాయిల్, వెంకట్, జి.వెంకటేశ్వర్లు, ఎర్రమల్ల నాగయ్య, చందపాక నాగరాజు, బంటు రవి, లలిత, కొండయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



పలు సంఘాల మద్దతు

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని పలు సంఘాల నాయకులు బి.నాగయ్య, పి.వెంకటేశ్వర్లు, గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, చిలుముల బాల్‌రెడ్డి, కొడదల శంకర్, ఆదిమళ్ల మణిరాజు, గాదె లింగస్వామి, కర్ర రాఘవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, గేర నరసింహ, కోమటిరెడ్డి నరసింహారెడ్డి, బి.సురేందర్‌రెడ్డి, ఎన్.రాజశేఖర్‌రెడ్డి, ఎ.యోగేందర్‌రెడ్డి, పి.ధర్మేందర్‌రెడ్డి, అనిల్‌కపూర్, వెంకట్‌రెడ్డి మద్దతు తెలిపారు.

ఆట ఏదైనా గెలిచి తీరుతాం


ఉమ్మడి నల్లగొండ జట్టులో కనగల్ మోడల్‌స్కూల్ విద్యార్థినులు



● ప్రతిభ చాటుతున్న విద్యార్థులు ● రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ
● పతకాలతో పాఠశాలలకు ప్రత్యేక గుర్తింపు ● ప్రోత్సహిస్తున్న పీఈటీ, పీడీలు

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమే. ఆటలు ఉంటేనే విద్యార్థులు మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వంతో ఉంటారు. విద్యార్థులకు క్రీడలపై ఉన్న ఆసక్తిని గుర్తించి వారికి సరైన శిక్షణ ఇస్తే ఆటల్లో ప్రావీణ్యం సంపాదించి మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని నిరూపిస్తున్నారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గురుకుల, మోడల్ స్కూల్ విద్యార్థులు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తూ పతకాల పంట పండిస్తున్నారు. వీరికి పీడీలు, పీఈటీలు తగిన శిక్షణ ఇస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు.

పతకాల పంట

నిడమనూరు 'గురుకుల' విద్యార్థుల ప్రతిభ



నిడమనూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకులంతోపాటు మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడల్లో రాణిస్తున్నారు. విద్యార్థులకు వివిధ క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తూ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఆయా పాఠశాలల అధ్యాపక సిబ్బందితోపాటు పీఈటీలు శ్రమిస్తున్నారు. మండలకేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన నాగరాజుతోపాటు షేక్ నవీద్ అనే పదో తరగతి విద్యార్థి కబడ్డీ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. నవీద్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కూడా అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికై ప్రతిభ కనబర్చి పాఠశాలకు గుర్తింపు తెచ్చారు. గత నెలలో హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. శ్రీహరి అనే తొమ్మిదో తరగతి విద్యార్థి అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలో జరుగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టులో పాల్గొన్నారు. షేక్ అబ్దుల్ అనే పదో తరగతి విద్యార్థి అండర్-19 విభాగంలో ఖోఖో ఆటలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. గత నెలలో సికింద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అదేవిధంగా ముస్తాక్ అనే విద్యార్థి అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పలువురు విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటూ పతకాలు సాధించారు. అదే విధంగా మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన కుర్రా సిద్ధూ అనే పదో తరగతి విద్యార్థి ఖోఖోలో రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా, అజయ్, గౌతమ్, మధు, సంతోష్ అనే విద్యార్థులు బాస్కెట్‌బాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరంతా గత నెలలో మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకొచ్చారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగిన తమ పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాశం వెంకట్‌రెడ్డి, చింతమళ్ల రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆటలపై ఇష్టం పెరిగింది



నేను మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. మా పీఈటీ ఇస్తున్న శిక్షణతో ఆటలపై ఇష్టం పెరిగింది. ఆయన శిక్షణతో అండర్-19 విభాగంలో ఖోఖో లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పోటీలో పాల్గొని ప్రతిభకనబరిచా. వివిధ స్థాయిల్లో జరిగే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తా.

కుర్రా సిద్ధూ, విద్యార్థి.

క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఆటలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి సరైన శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులకు చదువుతోపాటు ఆటలూ అవసరమే. ఆటలాడితేనే వారు ఆరోగ్యంగా ఉంటారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. పలువురు విద్యార్థులు వివిధ స్థాయిల్లో జరిగే పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చూపి పతకాలు సాధిస్తూ పాఠశాలకు గుర్తింపు తీసుకురావడం ఆనందంగా ఉంది.

అనుముల కోటేష్, పీఈటీ, నిడమనూరు.

పరుగుతో ప్రపంచస్థాయికి..

అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్న మాయవతి

డిండి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆమె పుట్టి పెరిగిందంతా గ్రామీణ వాతావరణంలోనే. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. చిన్నతనం నుంచి క్రీడలపై ఆసక్తి. ఆమె ఆసక్తికి తగిన శిక్షణ, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహం దొరకడంతో అంతర్జాతీయస్థాయికి ఎదిగారు డిండి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని మాయవతి.

ఆమె మాటల్లో..

మాది నల్లగొండ జిల్లా డిండి మండలం కామేపల్లి గ్రామం. అమ్మానాన్నలు నకిరేకంటి రామచంద్రమ్మ, అంజయ్యలు. మాది నిరుపేద కుటుంబం. అమ్మానాన్నలు వ్యవసాయ కూలీలు. మేము ముగ్గురం సంతానం. అన్నయ్య హరి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. చెల్లి మహాలక్ష్మీ మా ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. నేను ఏడో తరగతిలో ఉండగా మా పీఈటీ ఖోఖో ఆడేందుకు అవకాశం కల్పించారు. అప్పటినుంచి నాకు 100 మీటర్లు, 200 మీటర్లు పరిగెత్తేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కోచ్ పరశురాం శిక్షణలో మెళకువలు నేర్చుకున్నాను.

పదో తరగతిలో ఉండగానే..

2019-20లో నేను పదో తరగతిలో ఉండగానే రాష్ట్ర, జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్లు పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలను గెలుచుకున్నాను. జాతీయస్థాయిలో తొమ్మిది పతకాలు సాధించా. 2022 మే 22న ఫ్రాన్స్‌లోని నార్మండిలో జరిగిన ఐఎస్ఎఫ్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొనే అవకాశం నా ఒక్కదానికే దక్కింది. ఇక్కడ 100 మీటర్ల పరుగులో పతకం చేజారినా నిరుత్సాహపడలేదు. 200 మీటర్ల విభాగంలో లక్ష్యాన్ని 24.468 సెకన్లలో చేరుకొని అంతర్జాతీయ స్థాయిలో కాంస్య పతకాన్ని గెలుచుకొని సత్తాచాటాను. ఇంటర్ పూర్తిచేసి ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందాను. హైదరాబాద్ పుల్లెల గోపిచంద్ అకాడమిలో అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నా.


మాయవతి

ఈ సంవత్సరం డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు పూర్తికాగానే 2028 జూలై 14న అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలోని లాస్ ఏంజల్స్‌లో జరిగే ఒలంపిక్ క్రీడలు ఆడేందుకు మెరుగైన శిక్షణ తీసుకుంటాను. ఒలింపిక్ క్రీడల్లో పతకం సాధించాలని పట్టుదలతో ఉన్నాను.

కోచ్ పరశురాం తర్ఫీదుతో..

కోచ్ పరశురాం శిక్షణతో సాంఘిక సంక్షేమ డిండి గురుకుల క్రీడల అకాడమీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పరశురాం కోచ్‌గా క్రీడాకారులను తీర్చిదిద్దారు. డిండి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల క్రీడల అకాడమీకి 2019 మార్చిలో కోచ్‌గా నియమించారు. అకాడమిలోని 40 మంది క్రీడాకారులకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తగు ప్రోత్సాహం ఇచ్చారు. తన వద్ద శిక్షణ పొందిన డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి నకిరేకంటి మాయవతి 2022 మే 22న ఫ్రాన్స్ దేశంలోని నార్మండిలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలలో (ఐఎస్ఎఫ్) 200 మీటర్ల విభాగంలో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. డిండి మండల కేంద్రానికి చెందిన మరో విద్యార్థి అవుట అఖిల 2023 ఏప్రిల్ 30న ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో 1500 మీటర్ల విభాగంలో 6వ స్థానంలో నిలిచింది.

ఖోఖోలో అదరగొడుతున్న అక్కాచెల్లెళ్లు

కనగల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలం బొమ్మపల్లి గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు తాటికొండ పావని (ఇంటర్), తాటికొండ పల్లవి (తొమ్మిదో తరగతి) ఖోఖోలో అదరగొడుతున్నారు. మండల కేంద్రంలోని అక్కినేపల్లి వెంకటేశ్వర్‌రావు మెమోరియల్ మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఈ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొంటూ ఔరా! అనిపిస్తున్నారు. అండర్-19 విభాగంలో ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్రం తరపున పావని పాల్గొననుంది. గత నెలలో సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. ఇక ఆమె చెల్లె తాటికొండ పల్లవి కోయంబత్తూరులో అండర్-14 విభాగంలో జరిగిన ఖోఖో జాతీయస్థాయి పోటీల్లో గతనెలలో పాల్గొని ప్రతిభ కనబర్చింది. వీరిద్దరితోపాటు మరికొంత మంది పాఠశాల విద్యార్థినులు ఖోఖోలో తమ ప్రతిభ కనబర్చుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉమ్మడి నల్లగొండ జిల్లాజట్టు తరపున పాల్గొని నల్లగొండను మూడోస్థానంలో నిలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చుతూ ప్రశంసలు పొందుతున్నారు.



వాలీబాల్‌లో రాణిస్తున్న విద్యార్థినులు


రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన సందర్భంగా అందజేసిన మెమొంటోతో విద్యార్థినులు

కోదాడ రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు వాలీబాల్ పోటీల్లో రాణిస్తున్నారు. చిన్నప్పటినుంచి క్రీడలపై వీరికి ఆసక్తి ఉండడంతో వారు పాఠశాలలో ఖాళీ సమయంలో వాలీబాల్‌పై వారికున్న ఆసక్తిని గమనించిన స్కూల్ పీఈటీ గునుగుంట్ల రాంబాబు వారిని ప్రోత్సహిస్తూ రాష్ట్రస్థాయిలో పేరు రావడానికి ఎంతో కృషి చేశారు. గ్రామంలోని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థినులు దాక్షాయని, దీపిక, ఎస్‌కె.సైరాలు వాలీబాల్ పోటీల్లో అనేక బహుమతులు సాధించారు. వీరు ఇప్పటి వరకు మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరి ఆసక్తి, ప్రోత్సాహంతో ఇటీవల అక్టోబరు 27న ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించారు. తిరిగి అక్టోబరు 29, 30, 31 తేదీల్లో పెద్దపల్లి జిల్లా గోదావరి ఖనిలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాధించిన ఈ ముగ్గురు విద్యార్థినులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో మరిన్ని బహుమతులు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. గత ఐదేళ్లుగా క్రీడారంగంలో రాణిస్తున్నారని కోచ్ రాంబాబు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ కూడా తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తూ వారివెంట క్రీడాపోటీలకు సైతం తీసుకెళ్తూ విద్యార్థుల విజయానికి కృషి చేస్తున్నారు.


దాక్షాయని


దీపిక

క్రీడాకారులకు 'కొండ'ంత అండ

● వ్యాయామ ఉపాధ్యాయుడిగా సమర్థ సేవలు
● తన శిక్షణలో 30కి పైగా మెరికల్లాంటి క్రీడాకారులు


రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి గెలుచుకున్న టీమ్‌తో కొండ వెంకటేశ్

నార్కట్‌పల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):మెరికల్లాంటి క్రీడాకారులను తీర్చిదిద్దడంలో పీఈటీలు కూడా కఠోర శ్రమ పడాల్సిందే. అలాంటి మెరికల్లాంటి క్రీడాకారులను తీర్చిదిద్ది వారికి 'కొండ'ంత అండగా నిలుస్తూ పతకాలను సాధించేలా సాధన చేయిస్తున్నారు నార్కట్‌పల్లిలోని ఎంజేపీ బీసీ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ మూసీ ప్రాజెక్టు పీడీ కొండ వెంకటేశ్.

జాతీయ, రాష్ట్ర స్థాయిలో 30కి పైగా పతకాలు

పీడీగా కొండ వెంకటేశ్ శిక్షణలో ఈ కళాశాల నుంచి గడిచిన ఆరేళ్లలో సుమారు 30కి పైగా జాతీయ, రాష్ట్రస్థాయి పతకాలను విద్యార్థులు సాధించారు. దాదాపు 30మంది మెరికల్లాంటి క్రీడాకారులు తయారయ్యారు. సచిన్ అనే విద్యార్థి జావెలిన్ త్రోలో మూడుసార్లు జాతీయస్థాయిలో ప్రదర్శనకనబర్చాడు. ఇదే విద్యార్థి కబడ్డీలో కూడా రాణించాడు. అదేవిధంగా ఆరుగురు విద్యార్థులు ఖోఖో జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు.

విద్యార్థుల క్రీడాసక్తి పీడీలకు ఓ టాస్క్



విద్యార్థుల్లో ఉన్న క్రీడాసక్తిని కనిపెట్టడం పీడీలకు ఓ టాస్క్. అన్ని ఆటలు ఆడించాలి. అందులో ఏ విద్యార్థి ఏ ఆటపై ఆసక్తి చూపుతున్నాడో గుర్తించాలి. విద్యార్థులతో సమానంగా శారీరక అలసటను మేం కూడా భరించాల్సి ఉంటుంది.

కొండ వెంకటేశ్, పీడీ

హైవేపై వాహనాల రద్దీ


కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాలు

కేతేపల్లి, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): వీకెండ్ ముగియడంతో వచ్చిపో యే వాహనాలతో హైదరాబాద్-విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారి ఆదివారం రద్దీగా మారింది. వరుస సెలవుల నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు, విద్యార్థులు శుక్రవారం సొంతూళ్లకు ప్రయాణమయ్యారు. సెలవులు ముగించుకున్న వీరంతా సోమవారం తమతమ విధుల్లో చేరేందుకు సొంత వాహనాల్లో హైదరాబాద్, విజయవాడకు బయల్దేరారు. దీంతో ఆదివారం 65వ నంబరు జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా మారింది. సాధారణ రోజుల్లోనే ఈ రహదారి వాహనాలతో సందడిగా ఉంటుంది. ఈ క్రమంలో ఆంధ్రా నుంచి తెలంగాణకు, తెలంగాణ నుంచి ఆంధ్రాకు వెళ్లే వాహనాలతో ఈ నాలుగు లేన్ల రహదారి ఆదివారం మరింత సందడిగా మారింది. ఒకదాని తర్వాత ఒకటిగా ఇరువైపు ౹లా వాహనాలు విరామం లేకుండా వెళ్లాయి. ఈ క్రమంలో రహదారిపై విరామం లేకుండా వెళ్తున్న వాహనాలతో వెంటగల మండలంలోని గ్రామాల ప్రజలు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కబడ్డీ పోటీల విజేతగా కొల్లూరు ఫ్రెండ్స్ క్లబ్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పల్లె శ్రీనివాస్‌గౌడ్, పూల నాగయ్య

ఆలేరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్ర నల్లగొండ జిల్లా సౌజన్యంతో ఫ్రెండ్స్ క్లబ్ ఆలేరులో నిర్వహించిన బ్లాక్‌స్థాయి యువజన క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. రెండు రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన బ్లాక్‌స్థాయి వాలీ బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలకు ఆలేరు, యాద గిరిగుట్ట మండలాల నుంచి క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కబడ్డీలో ఫ్రెండ్స్ క్లబ్ కొల్లూరు(ప్రథమ), మంతపురి (ద్వితీయ), వాలీబాల్ పోటీల్లో కేసరి యూత్ వంగపల్లి (ప్రథ మ), ఫ్రెండ్స్ క్లబ్ ఆలేరు(ద్వితీయ), వంద మీటర్ల రన్నింగ్‌లో కరుణాకర్ (ప్రథమ), రాము (ద్వితీయ), లాంగ్ జంప్‌లో కరుణాకర్ (ప్రథ మ), భూమేశ్ (ద్వితీయ), షాట్‌పుట్ పూల చంద్రకుమార్(ప్రథమ), వినయ్ (ద్వితీయ), డిస్కస్‌త్రోలో సాయికుమార్(ప్రథమ), వినయ్ (ద్వితీయ) విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో విజేతలకు ఎన్‌వైకే సౌజన్యంతో బహుమతులు, ప్రశంసా పత్రాలు, షీల్డ్ అందజేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పల్లె శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు, పీడీ పూలనాగయ్య తెలిపారు. పోటీలు విజయవంతానికి సహకరించిన వారికి నిర్వాహకులు

యాదగిరికొండపై భక్తుల కోలాహలం


లక్ష్మీనృసింహుల నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


ఆలయ ఉత్తర తిరువీధిలో భక్తుల రద్దీ


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీ.శ్రావణ్‌కుమార్‌కు చిత్రపటం అందజేస్తున్న ఈవో ఏ. భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరికొండ ఆదివారం భక్తులతో కోలహలంగా మారింది. వరుస (రెండో శని, ఆదివారం) సెలవుదినాలు కావడంతో శివకేశవులను దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. దీంతో కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయి వైకుంఠ ద్వారం ఇరువైపులా వాహనాలను నిలిపారు. దివ్యాంగులు, మహిళలు, చంటి పిల్లల తల్లులను తూర్పు రాజగోపురం వద్దకు తరలిం చేందుకు ఎలక్ట్రికల్ వాహ నాలను వినియోగించారు. సుమారు 53వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెల పగా, ఉభయ క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. ప్రత్యేక దర్శనానికి గంట సమయం, ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యా ణోత్సవ మండపం, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్ర యశాల, కొండపైన, కింద ఆర్టీసీ బస్టాండ్లు కూడా కిక్కిరిసాయి. భక్తులను కొండపైకి తరలించేందుకు రద్దీకి తగినట్లు బస్సులను ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 57,65,859 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామి, అమ్మవార్లకు ఘనంగా నిత్య పూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు జరిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వీ.శ్రావణ్‌కుమార్ కుటుంబ సమేతంగా లక్ష్మీనృసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఈవో ఏ.భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటం అంద జేశారు. అంతకు ముందు కొండకింద సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఏనుగుల కుటుంబీకుల ఆత్మీయ సమ్మేళనం

● పాల్గొన్న 102 మంది కుటుంబ సభ్యులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామ పంచాయతీ పరిధిలోని పెరుమాండ్లబావికి చెందిన ఏనుగుల కుటుంబీకులు ఆత్మీయ సమ్మేళనం ఆది వారం పెరుమాండ్లబావి గ్రామంలోని వారి వ్యవసాయబావి వద్ద సంబురంగా నిర్వహించారు. సుమారు 150 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో ఏనుగుల కుటుంబం ఉండేది. ఆ కుటుంబానికి సంబంధించిన వారిలో వ్యవసాయం చేస్తున్నవారు ఇంకా అక్కడే నివసిస్తుండగా చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నవారు మాత్రం వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఏనుగు అంజిరెడ్డి, లక్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనానికి మొత్తం 102 మంది కుటుంబానికి చెందిన పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు. వనభోజనాలు వండుకుని భోజనం చేశారు. గ్రామంలో పురాతన హనుమాన్ ఆలయ జీర్ణోద్ధరణ, రోడ్డు మార్గం ఏనుగుల కుటుంబ ఖర్చుతోనే చేయించాలని నిర్ణయించారు.


సమ్మేళనంలో ఏనుగుల కుటుంబీకులు

పల్లెకు వెలుగులేవీ?

(5వ పేజీ తరువాయి)

ప్రయాణికులకు ఆటోలే దిక్కయ్యాయి. ప్రస్తుతం మండలంలోని ఏ ఒక్క గ్రామానికి బస్సు సదుపాయం లేదు. గతంలో నల్లగొండ-సూర్యాపేట-నార్కట్‌పల్లి డిపోల నుంచి నకిరేకల్-శాలిగౌరారం రూట్‌లోని మోత్కూరు, మనిమెద్దె, భైరవునిబండ, జగద్గిరిగుట్ట, నకిరేకల్-చిత్తలూరు మార్గంలో ఇటుకలపాడు, చిత్తలూరు ప్రాంతాలకు దాదాపు 25 బస్సులు నడిచేవి. ప్రతీ గ్రామానికి దాదాపు బస్సు వెళ్లేది. నకిరేకల్ - శాలిగౌరారం మార్గంలో చిత్తలూరు వరకు నైట్‌హాల్ట్ బస్సులుండేవి. ప్రస్తుతం ఈ బస్సులు నడవడం లేదు. పల్లెల విద్యార్థుల సౌకర్యార్థం నల్లగొండ డిపో నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు ట్రిప్పులు మాత్రమే బస్సు నడిపిస్తున్నారు. డ్రైవర్ల కొరత ఉన్నందున బస్సులు నడపలేకపోతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

● చండూరు మండల కేంద్రం నుంచి గుండ్రాంపల్లి, చామలపల్లి, పోచంపల్లి, గుర్రంపోడు మండల కేంద్రాలకు బస్సు సదుపాయం లేదు. మండల కేంద్రం నుంచి శిర్థంపల్లి, కొరటికల్ గ్రామాలకు నేటికీ బస్సు సౌకర్యం లేదు. చండూరు నుంచి గుర్రంపోడుకు సాయంత్రం ఒక్క ట్రిప్పు, తిరిగి ఉదయం గుర్రంపోడు నుంచి చండూరుకు ఒక ట్రిప్పు మాత్రమే బస్సు నడుస్తోంది. చండూరు-తుమ్మలపల్లి-నాంపల్లి మార్గంలో ఒక్క బస్సు కూడా తిరగడం లేదు. మండలంలో మెజార్టీ గ్రా మాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలే శరణ్యమయ్యాయి.



నల్లగొండ జిల్లా తిప్పర్తిలో బస్సులు లేక బాటసారుల ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

● పెద్దఅడిశర్లపల్లి మండలంలో గతంలో దే వరకొండ నుంచి పెద్దగుమ్మడం వరకు నైట్‌హాల్ట్ బస్సు ఉండేది. దాన్ని రద్దు చేశారు. ఉదయం పె ద్దగుమ్మడం-హైదరాబాద్ బస్సు మాత్రమే నడుపుతున్నారు. గతంలో ఘనాపురం-పోల్కంపల్లి-భీమనపల్లి-పెద్దవూర బస్సు ఉండేది. అది కూడా రద్దయింది. పీఏ.పల్లి నుంచి గుడిపల్లి మీదుగా నల్లగొండకు బస్సు సదుపాయం ఉండేది. దాన్ని రద్దు చేశారు. దీంతో మొత్తంగా మండలంలో 80 శాతం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.

● మునుగోడు మండలంలోని కల్వకుంట్ల, కల్వలపల్లి, పులిపలుపుల, జమస్థాన్‌పల్లి, కొరటికల్, ఊకొండి, కోతులారం, సోలిపురం, ఇప్పర్తి, కృష్ణాపురం, సింగారం, రత్నపల్లి, గంగోరిగూడెం, బీరెల్లిగూడెం తదితర గ్రామాలకు బస్సులు రావడం లేదు.

● దేవరకొండ డిపో నుంచి గతంలో చందంపేట మండలం చిత్రియాల మీదుగా రేకులగడ్డకు రోజుకు మూడు ట్రిప్పులు బస్సులు నడిచేవి. అవన్నీ రద్దయ్యాయి. అసలు బస్సు సౌకర్యమే లేదు. పోల్యానాయక్ తండాకి గతంలో దేవరకొండ నుంచి చందంపేట, మూడుదండ్ల మీదుగా బస్సులు నడిచేవి. ఇప్పుడవి రద్దయ్యాయి.

● మిర్యాలగూడ డిపో నుంచి దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం-కల్లెపల్లి- పుట్టలగడ్డ మార్గంలో కరోనా అనంతరం నష్టాలొస్తున్నాయని బస్సు రద్దు చేశారు. ఈ మార్గంలో ప్రధానంగా గురువారం, ఆదివారం కల్లేపల్లిలోని ప్రసిద్ధ బంగారుమైసమ్మ ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. వీరంతా ఆటోల్లో వెళ్లి ప్రమాదాలబారిన పడిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బస్సును పునరుద్ధరించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

యాదాద్రి జిల్లాలో..

● భువనగిరి జిల్లా కేంద్రం నుంచి నందనం-నామాతపల్లి-ఎర్రంపల్లి-వలిగొండ-మాధవనగర్-కంచనపల్లికి గతంలో రెగ్యులర్ బస్సు సర్వీసుల ఉండేవి. ప్రస్తుతం ఆ రూట్లో బస్సులు ఆపేశారు. అదేవిధంగా తుక్కాపూర్-గౌసనగర్-వీరవెల్లి-బండసోమారం-ఎర్రంబెల్లి-కాంచనపల్లి రూట్లో గతంలో ఉదయం, సాయంత్రం బస్సు సర్వీసులు నడిచేవి. అయితే ప్రస్తుతం విద్యార్థుల కోసమని ఒక్క ట్రిప్పే నడుపుతున్నారు. ఈ మార్గంలో బస్సు సర్వీసులు పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పల్లె వెలుగు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

● యాదగిరిగుట్ట మండలంలోని బాబుపేట, తాళ్లగూ డెం, యాసోజుగూడెం, కుమరిగూడెం గ్రామాలకు ఆరేళ్ల నుంచి బస్సులు వెళ్లడం లేదు. పెద్దకందుకూరుకు ఏడాది కాలంగా బస్సు సర్వీస్ నిలిచిపోయింది.

● ఆలేరు మండలంలో 16 గ్రామాల్లో ప్రధాన రహదారి మార్గంలో ఉన్న గ్రామాలు మినహా మిగిలిన గ్రామాలకు బస్సు సదుపాయం లేదు.

● ఆత్మకూరు(ఎం) మండలంలో గతంలో యాదగిరిగుట్ట డిపోనుంచి తుక్కాపురం, కూరెళ్ల మీదుగా మోత్కూరుకు వెళ్లే బస్సు, ఆత్మకూరు నుంచి వలిగొండ వెళ్లే బస్సు నడిచేవి. కరోనా నుంచి వీటిని పూర్తిగా రద్దుచేశారు. అదేవిధంగా మోత్కూరు-హైదరాబాద్ వెళ్లే బస్సును కప్రాయపల్లి, రహీంఖాన్‌పేట, తుక్కాపురం, రాయిపల్లి, కొండాపురం స్టేజీల వద్ద నిలపాలని స్థానికులు కోరుతున్నారు.

● మోటకొండూరు మండలంలో గతంలో నడిచిన బస్సుల్లో 90శాతం కుదించడంతో ప్రస్తుతం ఆటోలే దిక్కయ్యాయి. బీబీనగర్, సంస్థాన్‌నారాయణపురం, తుర్కపల్లి మండలాల్లోనూ గతంలో బస్సులు నడిచిన రూట్లలో ఇప్పుడు నిలిపివేశారు.

● గుండాల మండలంలోని నూనెగూడెం, బండకొత్తపల్లి, అంబాల, వంగాల గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో వంగాల మినహా మిగిలిన గ్రామాలకు బస్సు రూట్ ఉండేది. ప్రస్తుతం ఈ మార్గాల్లో బస్సు సదుపాయం లేదు.

● రాజాపేట మండలంలోని మెల్లగూడెం, కొత్తజాల, దూదివెంకటాపూర్ గ్రామాలకు బస్సు సదుపాయం లేదు. పుట్టగూడెం, కొండ్రెడ్డిచెరువు, సోమారం, లక్ష్మక్కపల్లి, నర్సాపూర్, కుర్రారంకి ఒకే బస్సు నడుస్తోంది. మిలిగిన గ్రామాలకు పూర్తిగా ఆటోలే దిక్కయ్యాయి. కొండ్రెడ్డిచెరువు-రాజాపేట మార్గంలో విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు నడుపుతున్నా అది ఎప్పుడొస్తుందో తేలికపోవడంతో వారు రోడ్ల మీదనే పడిగాపులు పడుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో...



మఠంపల్లి మండలంలోని తండాలకు బస్సులు లేక ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

సూర్యాపేట జిల్లాలోనూ పల్లెలకు ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. తక్కువ ఆదాయం వస్తుందనే కారణంతో బస్సులు నిలిపివేశారు. గతంలో నాలుగైదు ట్రిప్పులు తిరిగే రూట్లలో ఒక్క ట్రిప్పుకు, గతంలో నాలుగైదు బస్సులు షటిల్ తిరిగే రూట్లలో ఒక్క బస్సుకు పరిమితం చేశారు.

● హుజూర్‌నగర్ నుంచి మర్రిగూడెం, కరక్కాయలగూడెం, బూరుగడ్డ, లక్కవరం, శ్రీనివాసపురం గ్రామాలకు బస్సు సదుపాయం లేదు. హుజూర్‌నగర్-మఠంపల్లి-మట్టపల్లి-గుంటూరు మార్గంలో ఉదయం, సాయంత్రం బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. హుజూర్‌నగర్ నుంచి మేళ్లచెరువు, చింతలపాలెం మీదుగా గుంటూరు వరకు మార్గంలోనూ బస్సులు నడపాలని కోరుతున్నారు. పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ కర్మాగారం వరకే బస్సులు నడుస్తుండడంతో సమీప గ్రామాలైన గుండెబోయినగూడెం, గుండ్లపాడు, ఎల్లాపురం గ్రామాలకు ఆటోలే దిక్కయ్యాయి.

● మేళ్లచెరువు-హుజూర్‌నగర్ మార్గంలో గతంలో రెగ్యులర్‌గా ఆర్టీసీ బస్సు సర్వీసులుండేవి. కరోనా అనంతరం ఈ సర్వీసులను రద్దు చేశారు. అదేవిధంగా రేవూరు, వేపలమాదారం, హేమ్లాతండాకు గతంలో ఉన్న బస్సు సర్వీసులు రద్దయ్యాయి. కోదాడ-చింతిర్యాల బస్సులు గతంలో మేళ్లచెరువు, చింతలపాలెం మీదుగా వెళ్లేవి. ఈ సర్వీసులను కుదించి రోజుకు ఒక్కటే నడుపుతున్నారు. చింతలపాలెం-జగ్గయ్యపేట మార్గంలో బస్సులు ఆపేశారు. మేళ్లచెరువు - చింతలపాలెం మీదుగా గుంటూరు వరకు బస్సులు నడపాలని కోరుతున్నారు.

● కోదాడ డిపో నుంచి హుజూర్‌నగర్-లింగగిరి-సర్వారం-కొండాయిగూడెం-గానుగబండ మార్గంలో గతంలో బస్సు నడిచేది. ప్రస్తుతం దీన్ని రద్దుచేశారు. మిర్యాలగూడ డిపో నుంచి గరిడేపల్లి-కల్మలచెరువు-హనుమంతులగూడెం-యాతవాకిళ్ల మార్గంలోనూ బస్సు రద్దయింది. మట్టపల్లి-మఠంపల్లి-అంజలిపురం-అమరారం-లింగగిరి-సర్వారం-లక్ష్మీపురం-అబ్బిరెడ్డిగూడెం-హైదరాబాద్‌కు వెళ్లే బస్సు రద్దయింది. ఈ మార్గాల్లో కరోనాకు ముందు రెగ్యులర్ బస్సులు నడిచేవి. ప్రస్తుతం వీటిని నిలిపివేశారు.

● మోతె మండలంలోని నామవరం, సిరికొండ గ్రామాలకు గతంలో సూర్యాపేట డిపో నుంచి మూడు పూటలా బస్సులు నడిచేవి. ప్రస్తుతం రద్దవడంతో సూర్యాపేట నుంచి నామవరం, లాల్‌తండ, సిరికొండ పరిసర 12 గ్రామాలకు ప్రస్తుతం రాత్రి సూర్యాపేట నుంచి వెళ్లాలంటే ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఖమ్మం డిపో నుంచి తుమ్మగూడెం, నేరడవాయి వరకే బస్సులు వస్తున్నాయి. మారుమూల గ్రామాలైన బురకచర్ల, మేకలపాటితండా, ఉర్లుగొండ మార్గాల్లోనూ బస్సులు నడవడం లేదు. సూర్యాపేట-గుంజలూరుస్టేజీ-నామవరం-రాఘవాపురం క్రాస్‌రోడ్డు-ఖమ్మం జాతీయరహదారి వరకు బస్సులు నడపాలని విద్యార్థులు, గ్రామీణులు కోరుతున్నారు.

● సూర్యాపేట డిపో నుంచి మానాపురం వెళ్లే నైట్ బస్సు రద్దవడంతో తుంగతుర్తి, అన్నారం, అర్వపల్లి గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి కూడా బస్సు రద్దయింది.

● చివ్వెంల మండలంలోని ఖాసీంపేట, మోదీన్‌పురం, తిమ్మాపురం గ్రామాలకు బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు.

● చిలుకూరు మండలంలో గతంలో జానకీనగర్‌తండా-దూదియాతండా-సీత్లాతండాల మీదుగా నారాయణపురం వరకు బస్సు రద్దయింది. అదేవిధంగా బేతవోలు-జెర్రిపోతులగూడెం బస్సు, రామాపురం-ఆర్లెగూడెం-రామనగర్ మీదుగా కొండాపురం బస్సు కూడా రద్దయింది. ఈ మార్గాలకు బస్సులు పునరుద్ధరించాలని స్థానకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

● నల్లగొండ నుంచి ముప్పారం-ఎర్రబెల్లి మార్గంలో నాలుగేళ్ల క్రితం వరకు బస్సులు నడిచేవి. ముప్పారం బస్సు రోజూ నాలుగు ట్రిప్పులు, ఎర్రబెల్లి బస్సు మూడు ట్రిప్పులు నడిచేది. ప్రస్తుతం ఈ బస్సులు నడవడం లేదు. ఈ బస్సులతో నిడమనూరు మండలంలోని దుప్పలపల్లి, తొరగల్లు, మాదారం, మారపాక, ఎర్రబెల్లి, ఉట్కూరు, నందికొండవారిగూడెం, వేంపాడు తదితర గ్రామాల ప్రయాణికులకు, విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. రోడ్లు బాగాలేవని, ఆదాయం రావడం లేదని బస్సులను నిలిపివేశారు. మిర్యాలగూడ డిపో నుంచి మిర్యాలగూడ-త్రిపురారం-నిడమనూరు-మర్లగడ్డగూడెం మార్గంలో ఉదయం, సాయంత్రం బస్సులు నడిచేవి. ప్రస్తుతం ఇవి నడవడం లేదు.

● హాలియా-సూరేపల్లి, సూరేపల్లి-హాలియా-మిర్యాలగూడ మార్గంలో గతంలో ఉదయం, సాయంత్రం బస్సులు తిరిగేవి. ప్రస్తుతం అవి ఆగిపోయాయి. దీంతో పాటు హాలియా-నిడమనూరు-రామడుగు-యాచారం-కనగల్-నల్లగొండ మార్గంలో కూడా గతంలో ఉదయం, సాయంత్రం బస్సులు నడిచేవి. ప్రస్తుతం ఇవి నడవడం లేదు. మిర్యాలగూడ-త్రిపురారం-హాలియా-నాగార్జునసాగర్-నడిగడ్డ మార్గాల్లో కూడా బస్సులు నడవడం లేదు.

● నకిరేకల్ మండలంలో 17 పంచాయతీలకు జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రామాలు మినహా మిగిలిన చోట్లకు బస్సులు వెళ్లడం లేదు.

● గుర్రంపోడు మండలంలో నల్లగొండ-గుర్రంపోడు-దేవరకొండ మార్గంలో ఉన్న గ్రామాలకు మినహా మిగిలిన గ్రామాలకు బస్సు సదుపాయం లేదు.

బస్సుల కోసం భక్తుల నిరీక్షణ

● రద్దీ సమయాల్లో ఇబ్బందులు ● బస్సులు పెంచాలని వినతి



యాదగిరిగుట్ట బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

యాదగిరిగుట్టరూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. శనివారం, ఆదివారం వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారు. దీంతో ప్రయాణికులు అధిక సంఖ్యలో వస్తుండటంతో ఆర్టీసీ అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రయాణికులకు సరిపోను బస్సులు లేకపోవడంతో భక్తులు గంటల తరబడి ఎదురుచూస్తూ నిరీక్షించారు. దీనికి తోడుగా గూడూరు టోల్‌ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదం కారణంగా ట్రాఫిక్ జామ్ కావడంతో బస్సులు అక్కడే నిలిచిపోవడంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు మారుమూల గ్రామాలకు వెళ్లే సర్వీసులను రద్దు చేసినా భక్తులకు సరిపోనూ లేక అటు అధికారులు, ఇటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల్లో సీట్లు లేకపోయినా ఎలాగైనా ఇంటికి వెళ్లాలని ప్రయాణం కొనసాగిస్తున్నారు. రాత్రి 10 గంటల వరకైనా సరే ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా వారి గమ్యాలను చేర్చుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. బస్సుల సంఖ్యను పెంచి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సురక్షితంగా గమ్యానికి చేర్చుతాం : ప్రవీణ్‌కుమార్, ఆర్టీసీ సీఐ

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారందరినీ సురక్షితంగా గమ్యానికి చేర్చుతాం. శని, ఆదివారం సెలవులు కావడం, గూడూరు టోల్‌ప్లాజా వద్ద ప్రమాదం కారణంగా ట్రాఫిక్‌జాం అయింది. దీంతో ఆర్టీసీ బస్సులు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్‌జామ్‌తో కొంతవరకు ఆలస్యమైనా ప్రయాణికులందరినీ తప్పకుండా ఇళ్లల్లోకి చేర్చడమే ఆర్టీసీ లక్ష్యం.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

● కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ రాయాలి
● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

చౌటుప్పల్‌టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారికి ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్ఆర్)ను ఓఆర్‌ఆర్‌కు 40 కిలోమీటర్ల దూరం నుంచి నిర్మించాలని కోరుతూ కేంద్రప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సీపీఎం మహాసభలు ఆదివారం చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో రాఘవులు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని ఆరు జాతీయ రహదారులను కలుపుతూ ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారని, అందులో నాలుగు జాతీయ రహదారులకు ఆర్‌ఆర్‌ఆర్ నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉండే విధంగా అలైన్‌మెంట్ ఉందని ఆయన తెలిపారు. కానీ హైదరాబాద్- విజయవాడ, హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారుల్లో మాత్రం 28 కిలోమీటర్లకు కుదించి శాస్త్రీయ విధానాలను పాటించలేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలో కూడా 40 కిలోమీటర్ల దూరం నుంచే ఆర్‌ఆర్‌ఆర్‌ను ఏర్పాటు చేయాలని, దీంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని అన్నారు. ట్రిపుల్ అలైన్‌మెంట్‌కు సంబంధించి కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటుటూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. తక్షణమే అలైన్‌మెంట్ మార్పిడి కోసం కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాయాలని లేనిచో రైతుల ఉద్యమాలకు సీపీఎం మద్దతుగా పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. దేశంలోని బూర్జువా పార్టీలు వామపక్షాలను బలహీనపరిచే కుట్రలు చేస్తున్నాయని, ఎన్ని కుట్రలు చేసినా ఎర్రజెండా పోరాటాలను ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ ముఖ్యమంత్రుల మద్దతుతో దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, తమ రాష్ట్రాలకు నిధుల కోసం మోదీకి చంద్రబాబు, నితీష్‌కుమార్‌లు ఊడిగం చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్‌లు ధ్వంసం చేస్తున్నాయని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ప్రతిపక్షాల నోరు నొక్కుతుందని, రాజద్రోహం కేసులు పెట్టి జైళ్లల్లో వేస్తుందని ఆయన ఆరోపించారు. ఒకే దేశం-ఒకే ఎన్నికల విధానాన్ని సీపీఎం వ్యతిరేకిస్తుందని, ఈ విధానంతో ప్రాంతీయ పార్టీలకు నూకలు చెల్లుతాయని ఆయన అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ సీపీఎంకు ఓట్లు, సీట్లు లెక్క కాదని, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే ముఖ్యమని ఆయన అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రామన్నపేటలో ఏర్పాటు చేయతలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రతిపాదనను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండీ. పాషా, బండారు నర్సింహ, గంగదేవి సైదులు, రామేశ్వరి, పీఏపీఎస్ చైర్మన్ దోడ యాదిరెడ్డి, కౌన్సిలర్లు జి. లక్ష్మణ్, దండ అరుణ్ కుమార్, పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధు కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశం, కొండె శ్రీశైలం, నందీశ్వర్, బోదాస్ వెంకటేష్, చీరిక సంజీవరెడ్డి, అలివేలు పాల్గొన్నారు. అంతకు ముందు జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించారు.



చౌటుప్పల్‌లోని సీపీఎం బహిరంగ సభలో అమరజ్యోతిని స్వీకరించిన సీపీఎం పొలిట్ బూరో సభ్యుడు బీవీ రాఘవులు, వేదికపై నాయకులు చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి



సభకు గుర్రపుబండిపై వస్తున్న సీతారాములు, రంగారెడ్డి

ఎయిమ్స్ పాలకమండలి సభ్యుడిగా ఎంపీ చామల



కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), శాలిగౌరారం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ ఆస్పత్రులకు పాలకమండలి సభ్యులను ఎంపిక చేసినట్లు లోక్‌సభ సచివాలయం శనివారం రాత్రి ఒక ప్రకటనలో వెల్లడించింది. 12 ఎయిమ్స్ ఆస్పత్రులకు 24 మంది లోకసభ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేయగా తెలంగాణ రాష్ట్రంలోని బీబీనగర్ ఎయిమ్స్‌కు భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ (బీజేపీ)లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిమ్స్ పాలకమండలి సభ్యునిగా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందేలా కృషి చేస్తానని అన్నారు.

పాము కాటుతో రైతు మృతి



సత్తయ్య (ఫైల్)

ఆలేరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో ఆదివారం పాముకాటుతో రైతు మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు గ్రామానికి చెందిన బండి సత్తయ్య (44) ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గడ్డికట్టలు కడుతున్న క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అతడిని చికిత్స కోసం సమీపంలో ఉన్న జనగామ జిల్లా కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 4గంటలకు మృతి చెందాడు. సత్తయ్య ఒగ్గు కళాకారుడు. సత్తయ్యకు భార్య నాగమణితో పాటు ఇంటర్, 9వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

ఎల్లమ్మ ఆలయంలో మార్గశిర పౌర్ణమి పూజలు

కనగల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మార్గశిరమాస పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం ఉ దయం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలతో విశేష పూజలను జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీ రసారె ఒడి బియ్యం బోనమైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శిగా లచ్చిరాం



లచ్చిరాం

రామగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్ఈయూ) సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన ఉదావత్ లచ్చిరాం ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్థితప్రజ్ఞ, శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేస్తూ సంఘ నియమావళికి అనుగుణంగా పూర్తిస్థాయిలో పనిచేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన లచ్చిరాం మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

యాసంగి సాగుకు సన్నద్ధం

సిద్ధమవుతున్న మూసీ ఆయకట్టు రైతులు



కేతేపల్లిలో యాసంగి వరి సాగుకు ట్రాక్టర్‌తో దున్ని సిద్ధం చేస్తున్న పొలం

కేతేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు యాసంగి పంట సాగుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండలంలో ప్రవహించే మూసీ కుడి కాల్వ ఆయకట్టుతో పాటు ఏఎమ్మార్పీ డీ 49 కాల్వ ఆయకట్టు, చెరువులు, బావులు, బోర్ల ఆయకట్టులో ఈ యాసంగిలో భారీగా వరి సాగయ్యే అవకాశాలు ఉన్నాయి. గత వానాకాల సీజన్‌లో మండల వ్యాప్తంగా 20,672 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఇది ప్రస్తుత యాసంగి సీజన్‌లో మరింత పెరిగే అవకాశం ఉంది. గత వానాకాల సీజన్‌లో ఇబ్బడిముబ్బడిగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొర్లడం, చెరువులు, కుంటలు నిండటంతో భూగర్భ జలమట్టం పెరిగి వ్యవసాయ బావులు, బోర్లలో నీరు పుష్కలంగా ఉంది. ఈ నేపథ్యంలో గత వానాకాల సీజన్‌లో ముందస్తుగా వరి కోతలు పూర్తయిన రైతులు ఈ పాటికే యాసంగి నాట్లకు అవసరమైన వరి నారు పెంచుతున్నారు. కోతలు ఆలస్యంగా చేపట్టిన రైతులు దుక్కులు దున్ని, గొర్లు తోలి భూములు చదును చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. మూసీ ప్రాజెక్టుతో పాటు మండలంలోని చెరువులు, కుంటల ఆయకట్టుల్లో దాదాపు 25 వేల ఎకరాల వరకు వరి సాగు చేసే వీలుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తుంది.

మూసీ ఆయకట్టులో...

జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ఆయకట్టులో రైతులు భారీగా యాసంగి సాగు చేయనున్నారు. గత వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసినా ప్రాజెక్టు నీటిమట్టం ఏ మాత్రం తగ్గలేదు. ఎగువ నుంచి నిరంతరాయంగా వస్తున్న వరద నీటితో మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం గరిష్టస్థాయిలోనే ఉంది. ఈ నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు పరిధిలో గల నకిరేకల్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడెం నియోజకవర్గాల్లో స్థిరీకరించిన 33వేల ఎకరాల భూముల్లో యాసంగి పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల పరిధిలో అనధికారికంగా మరో 13 వేల ఎకరాల మేర పంటలు సాగు చేయనున్నారు. ప్రాజెక్టు ప్రధాన కాల్వలతో పాటు వాటి డిస్ట్రిబ్యూటరీ కాల్వలపైనా అక్రమంగా విద్యుత్ పంపు సెట్లు ఏర్పాటు చేసి కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి నీటిని తరలించి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో మూసీ ఆయకట్టులో సక్రమ, అక్రమ ఆయకట్టు కలిపి దాదాపు 46 వేల ఎకరాల్లో రైతులు యాసంగి పంటలు సాగు చేయనున్నారు.

రెండు పంటలకు నీరు ఇవ్వడం ఆనందం



మూసీ ఆయకట్టులో రెండు పంటల సాగుకు నీటిని విడుదల చేస్తుండటంతో ఆయకట్టు రైతులు ఆనందంగా ఉన్నారు. ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా చేరడంతో అధికారులు ముందస్తు నీటిని విడుదల చేయడం వల్ల ఇప్పటికే నాట్లకు అవసరమైన వరి నారు పెంచి నాట్లకు సిద్ధమవుతున్నాం.

- కోట లింగయ్య, చీకటిగూడెం



మూసీ కుడి కాల్వ పరిధిలో పెంచిన వరి నారు

ఖరారుకాని నీటి విడుదల షెడ్యూల్

మూసీ ఆయకట్టులో యాసంగి పంటల సాగుకు వారబందీ పద్ధతిలో సాగునీరు విడుదల చేయనున్నారు. యాసంగి సీజన్‌లో డిసెంబరు 18 నుంచి నాలుగు విడతలుగా ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసే ఆనవాయితీ కొన్నేళ్ల నుంచి కొనసాగుతుంది. ఈ ఏడాది ఇంకా నీటి విడుదల షెడ్యూల్ మాత్రం ఖరారు కాలేదు. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠస్థాయిలో ఉండటంతో ఆయకట్టులో వరి నార్ల పెంపకానికి ముందస్తుగా కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీటితో ఆయకట్టు గ్రామాల చెరువులు, కుంటలు ఇప్పటికే నిండి ఉన్నాయి. ఈ నీటితో రైతులు యాసంగి సాగుకు అవసరమైన వరి నార్ల పెంపకం చేపట్టారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు (4.46టీఎంసీలు)కాగా ప్రస్తుతం 644.45 అడుగులు (4.33టీఎంసీలు)గా ఉంది. నాలుగు రోజులుగా ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గిపోయింది.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గుడుంబాపై ఉక్కుపాదం

సంతోష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్



గుడుంబా తయారు చేసినా, సరఫరా చేసినా, కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ హెచ్చరించారు.

- (రామగిరి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు?

ఈఎస్: జనవరి నుండి నవంబరు వరకు జిల్లాలోని 7 ఈఎస్ పరిధిలో గల 1348 కేసులు నమోదు చేయడం జరిగింది. 583 మందిని అరెస్ట్ చేసి, 82 వాహనాలు, 2704 లీటర్ల సారాను సీజ్ చేశారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో కల్లులో కూడా కల్తీ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఈఎస్: జిల్లాలో కల్లులో కల్తీ జరుగుతున్న సంఘటనలు పెద్దగా ఏమి లేవు. సూరత్, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కొంతమంది కల్లులో కలిపే ఫ్లోరైడ్ హైడ్రేన్ వంటి మత్తు పదార్థాలను సరఫరా చేస్తుండగా నిఘా పెట్టి 30 కేజీలను స్వాధీనం చేసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి క్రయవిక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.

ఈఎస్: గంజాయి క్రయవిక్రయాలు, సరఫరాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. నిఘాలో భాగంగా హైవేపై తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి గంజాయిను సీజ్ చేశాం.

ఆంధ్రజ్యోతి: కొంతమంది వైన్స్ యజమానులు నిబంధనలు పాటించడం లేదు.

ఈఎస్: జిల్లాలో వైన్స్ నిర్వాహకులందరూ సమయపాలన మాత్రం ఖచ్చితంగా పాటిస్తున్నారు. వైన్స్‌ల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. కల్తీ జరిగే అవకాశాలు ఉండవు. అయినా మా బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూనే ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: కొందరు పర్మిట్‌రూం నిర్వాహకులు సమయపాలన పాటించడం లేదు.

ఈఎస్: పర్మిట్ రూం నిర్వాహకులు మద్యాన్ని విక్రయిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఇకపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తాం. నిబంధనలు కచ్చితంగా పాటించేలా ఆదేశాలు జారీ చేస్తాం.

జిల్లాలో ఆధ్యాత్మిక శోభ

నల్లగొండకల్చరల్, మునుగోడురూరల్, నార్కట్‌పల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. నల్లగొండ పట్టణంతో పాటు పలుచోట్ల అయ్యప్ప పడిపూజలను వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని చెర్వుగట్టు, గోపలాయపల్లి దేవస్థానాల్లో మాస కల్యాణాలు నిర్వహించారు.

● నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో స్వామివారిని ఆసీనులను చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అభిషేకాలు, లక్షబిల్వార్చన సహస్రనామార్చనలు వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కలశన్ అశోక్ ఆధ్వర్యంలో ఆలపించిన స్వామివారి భక్తిగీతాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని పూజించి పరవశించిపోయారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, అనిల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొలనుపాక రవికుమార్, ఆలయ ప్రధాన గురుస్వామి నోముల శ్యామ్, కలశన్ అశోక్, బండారు వెంకన్న, బొడ్డు శంకర్, బోయపల్లి లక్ష్మణ్‌గౌడ్, కొండల్, మల్లయ్య, లక్ష్మీనర్సయ్య, మేడం విశ్వప్రసాద్, చందు, తుపాకి భిక్షం, వెంకటేశ్వర్లు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడు మండలంలోని ఎలగలగూడెం గ్రామంలో అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. బొల్ల వెంకన్న గురుస్వామి నిర్వహణలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విజయేందర్‌రెడ్డి, బొడ్డు యాదగిరి, గడుసు శశిధర్ రెడ్డి, బొడ్డు నాగరాజు, సాగర్ల లింగస్వామి, బండి సైదులు, అయితగోని విజయ్, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రీ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కుమారి దాసోజు సౌమ్య ఈ యజ్ఞ కార్యక్రమంలో యోగదర్శనం స్తోత్రాన్ని, మంత్ర పుష్పాన్ని పఠించారు. ఆర్యసమాజ్ ప్రతినిధులు చింత హరిప్రసాద్, కొత్తపల్లి రాములు, ములుగురి యాదగిరి నటరాజ్, పోలోజు శ్రీను, ప్రొఫెసర్ శ్రీకాంత్, పాలకూరి నటరాజ్, ఉదయ్ ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.

మాండ్రలో: మండలంలోని మాండ్ర ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు ఉత్తరాపల్లి నర్సింహాచార్యులు, సిద్ధాంతి బేతోజు సత్యనారాయణల యాజ్ఞీకంలో హోమాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. వేడుకలో మల్లెబోయిన వెంకటేశ్వర్లు, గురిజ వీరస్వామి, శంకర్, మహేష్, లోకేష్, కిరణ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

● పౌర్ణమి తిథిని పురస్కరించుకుని మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం, గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానాల్లో ఆదివారం మాస కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చెర్వుగట్టులో ఆలయ మహామంటపంలో అర్చక స్వాములు సతీష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మల మంత్రోచ్చారణలు, భక్తుల శివన్నామస్మరణల మధ్య శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. గోపలాయపల్లి క్షేత్రంలో వేణుగోపాలస్వామి మాస కల్యాణ వేడుకలు కూడా కన్నులపండువగా జరిగాయి. కార్యక్రమంలో గోపలాయపల్లి దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నల్లగొండలో జరిగిన పడిపూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

కేజీబీవీ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ఉమాదేవి బదిలీ

శాలిగౌరారం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఉమాదేవిని పెద్దఅడిశర్లపల్లి కేజీబీవీ స్కూల్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఈవో బొల్లారం భిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దఅడిశర్లపల్లి కేజీబీవీ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ఎస్.ప్రవళికను శాలిగౌరారం బదిలీ చేశారు.

బస్సు ఢీకొని శివాలయ ఆవు మృతి

అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్థులు

కేతేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని శివాలయానికి చెందిన ఆవు మృతి చెందింది. ఈ సంఘటన కేతేపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి పట్టనంలోని శ్రీ శంభులింగేశ్వర దేవాలయ కమిటీ గోమాతను పెంచుతున్నారు. నిత్యం గ్రామంలో తిరిగే గోమాతను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పూజిస్తుంటారు. ఈ నెల 12వ తేదీన గురువారం సాయంత్రం గ్రామ నడిబోడ్డున గోవు జాతీయ రహదారిని దాటుతుండగా విజయవాడ వైపునకు వెళ్తున్న ఓ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిని గోవుకు వైద్య చికిత్సలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోమాతకు శివాలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆదివారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో అంత్యక్రియలను నిర్వహించారు. గోమాతను ట్రాక్టర్‌పై అంతిమయాత్ర నిర్వహించి గ్రామశివారులో హిందూ సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.

గొల్ల, కురుమలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

● జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్

మునుగోడు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గొల్ల, కురుమలకు ఇచ్చిన హామీని సత్వరమే నెరవేర్చాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాగర్ల మల్లేష్ డిమాండ్ చేశారు. మునుగోడులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం గొల్ల, కురుమలకు మొదటి విడతలో గొర్రెల పంపిణీ చేసి విస్మరించిందని, రెండో విడత పంపిణీ చేయకుండా ముఖం చాటేసిందన్నారు. ఆ రెండో విడత గొర్రెలను తాము పంపిణీ చేస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన గొల్ల, కురుమల ధర్నాకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కృష్ణయ్య రాజ్యసభకు ఎంపికపై హర్షం



నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్‌లో బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు నల్లగొండ బీసీ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం క్లాక్‌టవర్ సెంటర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. పంచుకున్నారు. ఆర్.కృష్ణయ్య బీసీల కోసం గత 50 సంవత్సరాలుగా చేస్తున్న సేవలను గుర్తింపుగా ఈ పదవి లభించిందని నాయకులు పేర్కొన్నారు. బీసీలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, కార్యదర్శి అల్లి వేణు, నాయకులు రమేష్, ప్రసన్న కుమార్, గుండు వెంకటేశ్వర్లు, కూరెళ్ల విజయ్‌కుమార్, వెంకన్న, శ్రీనివాస్, ఏడుకొండల్, చం ద్రయ్య, దశరథ, తిరుపతయ్య, భరత్, శంకరాచారి, గిరి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

కట్టంగూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన నలమాద కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన శిరస్సు వెంకన్న మృతి చెందాడు. వెంకన్న మృతదేహంపై ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయా కార్యక్రమాల్లో అయితగోని నారాయణ, నంద్యాల వెంకట్‌రెడ్డి, రెడ్డిపల్లి సాగర్, ఎడ్ల పెద్దరాములు, మిట్టపల్లి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

కట్టంగూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు ప బ్బు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండలంలోని ఎర్రసానిగూడెం గ్రామంలో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. అనంతరం బూత్ కమిటీ అధ్యక్షుడిగా కొరివి నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పులకరం శంకర్, గున్నాల నాగరాజు, కోమటి భాస్కర్, బత్తిని నాగరాజు, ఉట్కూరి చిరంజీవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం



నిరుపేద మెడికల్ విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్

నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. నల్లగొండ పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఇద్దరు విద్యార్థులకు చెక్కులు అందజేశారు. కొండపల్లి గ్రామానికి చెందిన మెడికల్ విద్యార్థిని అందుగుల ప్రవళికకు ఆశాజ్యోతి ఫౌండేషన్ న్యూజెర్సీకి చెందిన దాట్ల చందన, ఎం.ప్రభాకర్ ఆధ్వర్యంలో రూ.1.30 లక్షల చెక్కు అందజేశారు. కనగల్ మండలం చెట్లచెన్నారం గ్రామానికి చెందిన మెడికల్ విద్యార్థి వంశీకి మొదటి సంవత్సరానికి రూ.23వేల చెక్కును అందజేశారు. ఇప్పటికే గాదరి కిషోర్ ఉన్నత చదువుల కోసం నిరుపేదలైన 40 విద్యార్థులకు మందికి ఆర్థికసాయం అందించి వారికి అండగా నిలిచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పగడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : సామేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యూత్ కాంగ్రెస్ నాయకులు పనిచేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పోల్‌దాస్ నరేష్ ఎమ్మెల్యే సామేలును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నరేష్‌ను అభినందించి శాలువాతో సన్మానించి మాట్లాడారు. కాంగ్రెస్ బలోపేతానికి కాంగ్రెస్ అనుబంధ సంస్థలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చామల వెంకటరమణారెడ్డి, పడాల రమేష్, కర్నాటి కృష్ణ, హరినాగరాజు, పెండెల వినయ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల వద్దకు వెళ్లిన టీచర్లు

శాలిగౌరారం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ, కుక్కడపు శ్రీనివాస్ శాలిగౌరారం, తిరుమలరాయినిగూడెం, పావురాలగూడెం గ్రామాల్లో ఆదివారం 'స్టడీ డ్రైవ్' నిర్వహించారు. 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లల చదువు గురించి కొన్ని మెళకువలను తెలియజేశారు.

నల్లగొండ నియోజకవర్గం..

శిక్షణ పొందిన ముగ్గురికి కానిస్టేబుల్ కొలువులు

నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జీడీ ఫలితాల్లో జిల్లా పరిషత్ సడ్డీ సర్కిల్ సెంటర్‌లో శిక్షణ పొందిన ముగ్గురు అభ్యర్థులు కానిస్టేబుళ్లుగా ఎంపికయినట్లు జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన కొడిరెక్క నవీన్, సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన పల్లి రాజేష్‌లు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన ఎడవెల్లి వంశీ ఐడీపీఎల్ కానిస్టేబుల్‌గా ఎంపికైనట్లు తెలిపారు.

ఘనంగా కేవీ వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కేవీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

నల్లగొండ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాక దినోత్సవాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సింధూర పాల్గొన్నారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుథకు నాణ్యమైన విద్యను అందించి, వారి అభ్యున్నతికి పాల్పడుతున్నట్లు వివరించారు. పూర్వ విద్యార్థులు, ఉప్యాధాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు సిద్ధం

నల్లగొండ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్పందించక పోతే నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనాలు, పర్మినెంట్, ఇతర పెండింగ్ సమస్యల సాధన కోసం ఈ నెల 17వ తేదీన జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు అధిక తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు సత్యనారాయణ, అంజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

మునుగోడు నియోజకవర్గం..

కొంపల్లి చెరువుకు నీరు అందేలా చూస్తా: మేఘారెడ్డి

మునుగోడు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంపల్లి పెద్ద చెరువుకు నీరు వచ్చే విధంగా కాలువను పునరుద్ధరించడానికి వెదిరె పూలమ్మ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తానని ఫౌండేషన్ చైర్మన్ వెదిరె మేఘారెడ్డి, గ్రామ ఆలయ చైర్మన్ వెదిరె విజేందర్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం కొంపల్లి గ్రామస్తులతో కలిసి చెరువుకు నీరు వచ్చే కాలువలను పరిశీలించారు. పుట్టపాక గ్రామ శివారు నుంచి సుమారు 4కి.మీలు కాల్వను రైతులతో కలిసి పరిశీలించారు. వెదిరె పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ చెరువును పునర్నిర్మాణ పనులు చేపట్టి, అభివృద్ధి చేసి రైతులకు నీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచులు జాల వెంకన్న, బొయపర్తి లింగయ్య, బాజ మనోజ్, మాజీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

మునుగోడు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కల్వకుంట్ల గ్రామంలో ఆదివారం సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి, సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల ముత్యాలు మాట్లాడారు. గ్రామంలో పాలకులు మారుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. సమస్యలపై అనేక మార్లు అధికారులకు విన్నపాలు చేసి, ధర్నాలు నిర్వహించినా స్పందన లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి పగిళ్ల మధు, అయితగోని యాదయ్య, పెద్ద అంజయ్య, పగిళ్ల అంజయ్య, నారగోని సైదులు, పగిళ్ల యాదయ్య, సింగపంగ లింగయ్య డీవైఎఫ్ఐ నాయకులు కట్ట లింగస్వామి, కట్ట వెంకన్న, కట్ట ఆంజనేయులు, జిల్లపల్లి శివ పాల్గొన్నారు.

గణేష్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

మునుగోడు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ మాజీ మండల అధ్యక్షుడు ఈదలకంటి గణేష్ ఆశయ సాధన కోసం పాటుపడాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపారి వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మునుగోడు మండలంలోని ఎలగలగూడెం గ్రామంలో ఈదులకంటి గణేష్ 13వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాపరంగా పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి నిరసిస్తూ గణేష్ అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. సురిగి చలపతి, ఈదులకంటి కైలాస్, ఉదయ్ పాల్గొన్నారు.

నకిరేకల్ నియోజకవర్గం..

వెలిమినేడును మండలం చేయాలి

చిట్యాల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని వెలిమినేడును మండలం చేయాలని కోరుతూ వెలిమినేడు మండల సాధన సమితి నేతలు ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెలిమినేడు మండలం ఏర్పాటుకు ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేయగా ప్రయత్నిస్తానని వారికి ఎమ్మెల్యే చెప్పారు. కాగా వెలిమినేడు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటైన, ఏర్పాటవుతున్న పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కుంటున్న సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. వెలిమినేడు గ్రామానికి ఒకరోజు సమయం పూర్తిగా కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వీరేశం వారికి హామీ ఇచ్చారు. మండల సాధన సమితి గౌరవాధ్యక్షుడు దేశబోయిన నర్సింహ, అధ్యక్షుడు పోలగోని శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి కూనూరు గణేశ్, కోశాధికారి గోలి సాయి, పోలగోని శ్రీకాంత్, అరూరి పవన్ తదితరులు ఉన్నారు.


సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయాలి

చిట్యాల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న నల్లగొండ లో నిర్వహించే సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లిలో నిర్వహించిన పార్టీ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో ఉరికంబాలు ఎక్కిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఈనెల 26న అన్ని మండల కేంద్రాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని పార్టీ బాధ్యులకు సూచించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎడీ.అక్బర్, నాయకులు బొడిగె సైదులు, జిల్ల సత్యం, కేతరాజు అంజయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతం కోసం కృషి చేయాలి

కట్టంగూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని ఎర్రసానిగూడెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా కొరివి నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ నాయకులు పులకరం శంకర్, గున్నాల నాగరాజు, కోమటి భాస్కర్, బత్తిని నాగరాజు, ఉట్కూరి చిరంజీవి, పులకరం మహేష్, బాను, లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 16 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.128	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 | కనిష్ఠం 17.6

పల్లెకు వెలుగులేవీ?

రాత్రివేళ బస్సులేవీ?



- 80శాతం గ్రామాలకు నిలిచిన సేవలు
- గతంలో నడిచిన రూట్లలో ఆదాయం లేదంటూ నిలిపివేత
- ఆటోలే ప్రయాణికులకు దిక్కు
- రాత్రి 9.30 దాటితే హైదరాబాద్ నుంచి నల్లగొండ, యాదాద్రికి బస్సులు నిల్

ఉమ్మడి జిల్లాలో పదేళ్ల క్రితం వరకు చివరి గ్రామాలకు నైట్‌హాల్ట్ బస్సు ఉండేది. ప్రతీ ఆర్టీసీ డిపో నుంచి కనీసం 20 రూట్లలో ఇవి కొనసాగేవి. మారుమూల, సరిహద్దు ప్రాంతాలకూ ఈ బస్సు సర్వీసులుండేవి. ఉమ్మడి జిల్లాలోని ప్రతీ గ్రామానికి ఉదయం 10గంటలలోపు, సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్య బస్సులు అందుబాటులో ఉండేవి. డీజిల్ ధరల పెంపు, మరోవైపు ఆటోల తాకిడి, ప్రైవేట్ వాహనాల వినియోగం పెరగడం, ఆర్టీసీలో డ్రైవర్ల నియామకాలు లేకపోవడం తదితర కారణాలతో ప్రధానంగా పల్లెలకు వెళ్లే బస్సుల నిర్వహణ ఆర్టీసీకి భారంగా మారింది. దీంతో కొన్ని రూట్లలో బస్సులు నడిపితే నష్టాలు వస్తుండడంతో క్రమంగా సర్వీసుల సంఖ్యను తగ్గించింది. కరోనా అనంతరం సర్వీసులనే రద్దు చేసింది. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులవెంట ఉన్న గ్రామాలకు మాత్రమే రెగ్యులర్ బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. 80శాతం పల్లెలకు ఆర్టీసీ బస్సులే వెళ్లడం లేదు. ఒకప్పుడు ఏడిపో నుంచైనా రాత్రి 8గంటల వరకు నైట్‌హాల్ట్ బస్సులు అందుబాటులో ఉంటే, ప్రస్తుతం చీకటి పడితే బస్సు దొరకడం లేదు. తాజాగా, ఏడాది కాలంగా మహిళలకు ఉచితప్రయాణం కల్పిస్తుండటంతో పల్లెల్లో ఆర్టీసీ బస్సులకు డిమాండ్ పెరిగింది. అయితే డిమాండ్‌కు తగ్గట్టు బస్సులను పెంచలేకపోతుండడంతో ఇటీవల ఆమేరకు విన్నపాలు పెరిగాయి. ఈపరిస్థితిలో 80శాతం పల్లెలకు బస్సు లు వెళ్లని పరిస్థితిపై అధ్యయనం చేయాలని, ఈ రూట్లలోనూ నిర్ణీత బస్సులనైనా నడపాలని, పెద్దబస్సుల స్థానంలో మినీ, ఎలక్ట్రిక్‌బస్సులు ప్రవేశపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నల్లగొండ జిల్లాలో ఇలా..

నార్కట్‌పల్లి నుంచి బ్రాహ్మణవెల్లంల మీదుగా మునుగోడు వరకు ఉదయం, సాయంత్రం బస్సులు నడిచేవి. ఏళ్లుగా ఈ రూట్లో బస్సులు నిలిపేశారు. దీంతో ఈ రూట్లో వెళ్లే ప్రయాణికులు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు.

- నల్లగొండ డిపో నుంచి కట్టంగూరు మండలం పిట్టంపల్లి-ఇస్మాయిల్‌పల్లి-పామనగుండ్ల-ఎరసానిగూడెం బస్సు గతంలో రెండు పూటలా వచ్చేది. కరోనా తరువాత నుంచి ఈ బస్సు నడవడం లేదు. కట్టంగూరు-కురుమూర్తి-గార్లబాయిగూడెం-చెరువుఅన్నారం-నకిరేకల్‌కు గతంలో బస్సు ఉండేది. దీన్ని రద్దుచేయడంతో ఈ ప్రాంత ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కట్టంగూరు-కలిమెర-పరడ-అమ్మనబోలు-నక్కలపల్లి బస్సు గతంలో సౌకర్యవంతంగా ఉండేది. దీన్ని రద్దుచేయడంతో ఆటోలే దిక్కయ్యాయి.
- కేతేపల్లి మండలంలో జాతీయరహదారిపై ఉన్న ఉప్పలపాడు, చీకటిగూడెం, కేతేపల్లి, కొర్లపాడు, ఇనుపాముల గ్రామాలకు, సూర్యాపేట-మిర్యాలగూడ మార్గంలోని భీమారానికి తప్ప ఈ మండలంలో ఇతర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో కొప్పోలు-భీమారం-చెరుకుపల్లి మీదుగా సూర్యాపేట-మిర్యాలగూడ పట్టణాల మధ్య బస్సు సర్వీసులుండేవి. సూర్యాపేట-మిర్యాలగూడ వయా భీమారం రూట్లో మూసీ వంతెన నిర్మాణం తర్వాత కొప్పోలు-తుంగతుర్తి-చెరుకుపల్లి మీదుగా మిర్యాలగూడ వెళ్లే బస్సులను ఆరేళ్ల క్రితం రద్దు చేశారు. మెజార్టీ గ్రామాలకు బస్సు సదుపాయం లేదు.
- శాలిగౌరారం మండలంలో దాదాపు 35 గ్రామాలు ఉన్నాయి. గతంలో ఉన్న బస్సులను కరోనా సమయంలో రద్దు చేయడంతో

- మిగతా 7వ పేజీలో...

హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే బస్సులు ఏవైనా రాత్రి 9 గంటల తర్వాత నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ బస్టాండ్లలోకి రాకుండా బైపాస్ నుంచి నేరుగా వెళ్లిపోతున్నాయి. రాత్రి 9.30గంటలకు హైదరాబాద్-కోదాడ బస్సు వెళ్లాక హైదరాబాద్-చౌటుప్పల్-చిట్యాల-నార్కట్‌పల్లి-నల్లగొండ-మిర్యాలగూడ మార్గంలో ఏపీ బస్సులు మినహా తెలంగాణ డిపోల బస్సులు నడవడం లేదు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. లేదంటే తెల్లవారు జామున 3.30గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఇదే రూట్‌లో హైదరాబాద్ వెళ్లాలంటే అదే పరిస్థితి నెలకొంది. పలుమార్లు ప్రయాణికులకు, ఏపీ

రాత్రి వేళ ప్రయాసే

బస్సుల డ్రైవర్లు, కండక్టర్ల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు కూడా జరిగాయి. రాత్రి 10గంటలకు ఈ మార్గంలో కనీసం ఒక్క బస్సునైనా నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి జిల్లాలోని బీబీనగర్, భువనగిరి, యాదగిరిగుట్ట మార్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జూబ్లీ బస్టాండ్ నుంచి రాత్రి 8గంటల తర్వాత వచ్చే జనగాం, తొర్రూరు, వరంగల్, హనుమకొండ బస్సులు భువనగిరి పట్టణంలోనికి రాకుండా బైపాస్ నుంచి వెళ్లిపోతున్నాయి. దీంతో భువనగిరి ప్రయాణికులకు రాత్రి వేళ పట్నం నుంచి రావాలంటే ప్రయాస పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల ప్రయాణికులు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పరిశీలించిన తర్వాత ఆర్టీసీ అధికారులకు బస్సు సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇంకా కార్యాచరణ మాత్రం అమలు కాలేదు.

బస్సుల కోసం డిమాండ్ పెరిగింది



నల్లగొండ రీజియన్‌లో గత ఏడాది కాలంగా ప్రధానంగా మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చాక గ్రామీణ రూట్లలో బస్సులు నడపాలనే డిమాండ్ ఎక్కువైంది. ప్రైవేట్ వాహనాల వినియోగం, డీజిల్ ధరలు పెరగడం, కేవలం విద్యార్థులు మాత్రమే వినియోగిస్తున్న నేపథ్యంలో కరోనాకు ముందు పలు మార్గాల్లో ఆర్టీసీ బస్సులకు ఆదరణ తగ్గి పూర్తినష్టాలు రావడంతో సర్వీసులు నిలిచాయి. కరోనా వల్ల మరికొన్ని సర్వీసులు ఆగాయి. అయితే ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టాక బస్సు ప్రయాణాలు పెరిగాయి. అదే క్రమంలో పల్లె రూట్లలో బస్సులు నడపాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌ను మేం ప్రభుత్వానికి నివేదించాం. కొత్త బస్సులు వస్తున్నా, ఇంకా కొత్త రూట్లలో ప్రవేశపెట్టేస్థాయిలో సరిపోవడం లేదు. పాత బస్సులను తొలగించి వాటి స్థానంలోనే కొత్త బస్సులు వస్తున్నాయి. ప్రజల డిమాండ్ మేరకు క్రమేపీ బస్సులు పెంచుకుంటూ వెళతాం. హైదరాబాద్ నుంచి ఇటు నల్లగొండకు, అటు యాదాద్రి జిల్లాకు రాత్రివేళ 9.30గంటల తర్వాత సర్వీసులు ఉండడం లేదనే సమస్యను పరిష్కరిస్తాం. శీతాకాలం ముగిశాక రాత్రి 10గంటల వరకకు బస్సు సర్వీసులు హైదరాబాద్ నుంచి ఈ రెండు జిల్లాలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతాం.

- జానిరెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, నల్లగొండ

ఉ..హు..హూ..

- నాలుగు రోజులుగా తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- 17.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వణికిస్తున్న చలి



నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చలి పులి వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. నాలుగు రోజులుగా 24 గంటలూ చల్లటి వాతావరణం ఉంటుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధుల పరిస్థితి దయనీయంగా ఉంది. చల్లటి గాలుల కారణంగా మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లాలనే వారు కూడా ఎండ వచ్చాకే ఇంటి బయటికి వస్తున్నారు. చాలా మంది పనులున్న వారు కూడా చల్లటి గాలులకు బయటికి వెళ్లలేకపోతున్నారు. ఆదివారం 17.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చలి గాలులతో చాలా మంది జ్వరాలు, ఒంటి నొప్పులతో పాటు శ్వాస సంబంధిత వ్యాధులు, ముక్కు, చెవి, గొంతు నొప్పులతో బాధపడుతున్నారు. చలి తీవ్రత అధికంగా ఉండటంతో వ్యాయామం, వాకింగ్ తగ్గి మధుమేహం, బీపీ బాధితులు ఇబ్బంది పడుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పలువురు చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంటుండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
12	28.5	19.4
13	29.0	19.0
14	28.0	18.0
15	27.5	17.6

గ్రూప్-2 తొలిరోజు పరీక్షలు ప్రశాంతం



నల్లగొండలో అభ్యర్థులను తనిఖీచేసి అనుమతిస్తున్న సిబ్బంది

నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 తొలి రోజు పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో ఏర్పాటు చేసిన 87 కేంద్రాల్లో పరీక్షలు కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని రామగిరిలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలాత్రిపాఠి తనిఖీచేశారు. కేటాయించిన అభ్యర్థులు, హాజరు, గైర్హాజరైన అభ్యర్థుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షల సందర్భంగా జిల్లాలో ఎలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. పరీక్షల సందర్భంగా పోలీస్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులకు కేటాయించిన విధులను తప్పకుండా నిర్వహించాలన్నారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు.

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

(మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ తెలిపారు. ఆదివారం పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. 28 కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా సాగాయన్నారు. అదేవిధంగా తహసీల్దార్ హరిబాబు, రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరమణ, రూట్ ఆఫీసర్లు బాలునాయక్, ధర్మానాయక్, శివకుమార్, నాగరాజు తదితరులు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు.

ఆలస్యంగా రావడంతో..

గ్రూప్-2 పరీక్షకు ఆలస్యంగా వచ్చిన ఏడుగురు అభ్యర్థులను అధికారులు వెనక్కు పంపారు. కమిషన్ నిబంధనల మేరకు గ్రూప్ పరీక్షలకు నిమిషం నిబంధన అమలులో ఉండగా, మిర్యాలగూడ మినా కళాశాల పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు అనుమతించలేదు.



కాకతీయ డిగ్రీ కళాశాలలో పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నేటి నుంచి సీఎం కప్ క్రీడలు



మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డి తెలిపారు. ఆదివారం అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి మాట్లాడుతూ, ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 16న ఉదయం 10.30గంటలకు కబడ్డీ పోటీలతో టోర్నమెంట్ ప్రారంభమవుతుందని తెలిపారు. క్రీడాకారులు 9.30గంటలకే హాజరు కావాలని కోరారు. 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు 20 క్రీడాంశాల్లో వివిధ స్టేడియాల్లో వేర్వేరుగా పోటీలు సాగుతాయని తెలిపారు.

నీలగిరి అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ?

రామగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. 2023-24లో ఐటీహబ్, వల్లభరావు చెరువు, సమీకృత మార్కెట్, పార్కులు, మెడికల్ కళాశాల, ప్రధాన రోడ్లు, జంక్షన్లు తదితర అభివృద్ధి పనులను సుమారు రూ.700కోట్లతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టారు. ఈ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గత ఏడాది విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను మునిసిపల్ అధికారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ రికార్డుల ఆధారంగా వివిధ అభివృద్ధి పనుల అగ్రిమెంట్లు, పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో రెండు రోజులుగా విచారిస్తున్నట్ట తెలిసింది. ఈ విచారణ మరో వారం రోజుల పాటు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి నివేదించనున్నట్టు సమాచారం.

రైతాంగ పోరాటాలను అణచివేస్తున్న కేంద్రం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగిస్తున్న పోరాటాలను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఢిల్లీలో రైతులు సాగించిన పోరాటాల ఫలితంగా కేంద్రం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసేలా కేంద్రం రైతులు సాగిస్తున్న ఉద్యమాన్ని నీరుగార్చేలా కుట్రలు చేస్తోందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి మద్దతు ధరల చట్టం అమలు చేయాలని, ఉపాధిహామీ పథకం పనిదినాలు పెంచి దినసరి వేతనాలను పెంచాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా, రుణమాఫీ రైతులందరికీ వర్తింపచేయాలని, పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, రేషన్‌కార్డులు, పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పతాని శ్రీను, జూకూరి నాగయ్య, అయితగాని విష్ణు, గడగోజు వెంకటాచారి, శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

నల్లగొండ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆరో రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజు మాట్లాడుతూ, విద్యాశాఖలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులుగా 19,300 మంది, జిల్లాలో 1,100 మంది వివిధ విభాగాల్లో 20 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. విద్యాశాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నా, సరైన వేతనాలు ఇబ్బంది పడుతున్నామన్నారు. గతంలో సీఎం ఇచ్చిన మాటకు కట్టుబడి తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్, కార్యదర్శి కంచర్ల మహేందర్, డి.నీలాంబరి, కొండ చంద్రశేఖర్, గుమ్మల మంజులారెడ్డి, సావిత్రి, వి.సావిత్రి, పుష్పలత, చౌడోజు శ్రీధర్, సాయిల్, వెంకట్, జి.వెంకటేశ్వర్లు, ఎర్రమల్ల నాగయ్య, చందపాక నాగరాజు, బంటు రవి, లలిత, కొండయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షకులు



పలు సంఘాల మద్దతు

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని పలు సంఘాల నాయకులు బి.నాగయ్య, పి.వెంకటేశ్వర్లు, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, చిలుముల బాల్‌రెడ్డి, కొడదల శంకర్, ఆదిమళ్ల మణిరాజు, గాదె లింగస్వామి, కర్ర రాఘవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, గేర నరసింహ, కోమటిరెడ్డి నరసింహారెడ్డి, బి.సురేందర్‌రెడ్డి, ఎన్.రాజశేఖర్‌రెడ్డి, ఎ.యోగేందర్‌రెడ్డి, పి.ధర్మేందర్‌రెడ్డి, అనిల్‌కపూర్, వెంకట్‌రెడ్డి మద్దతు తెలిపారు.

ఆటల్లో ఆణిముత్యాలు

● రగ్బీ, కబడ్డీ, హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణిస్తున్న విద్యార్థులు ● వారి వెన్నంటి ప్రోత్సహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు

కొండమల్లేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ అబ్బురపరుస్తున్నారు కొండమల్లేపల్లి మండలం దేవత్‌పల్లి గేటు వద్ద ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థినులు. కబడ్డీ, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటుతూ మరిన్ని విజయాలు సాధించగలమని నిరూపిస్తున్నారు. దాతల ప్రోత్సాహంకోసం చూస్తున్న ఈ గ్రామీణ క్రీడామణులు..., పట్టుదల ఏకాగ్రత, క్రమశిక్షణతో గురువులిచ్చే శిక్షణ, మెళకువలతో సాధనచేస్తూ రాష్ట్రస్థాయిలో విజయకేతనం ఎగురవేస్తూ అబ్బురపరుస్తున్నారు.

జాతీయస్థాయి రగ్బీలో ప్రతిభ

పెద్దవూర మండలం పాల్తీతండాకు చెందిన పాల్తీ మంగ్యా, అరుణ దంపతుల కుమార్తె అఖిల జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తోంది. ఇటీవల రాష్ట్రస్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలువగా, రగ్బీ పోటీల్లో జాతీయస్థాయిలో పాల్గొంది. అలాగే ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొని రూ.30వేలు గెలుచుకుంది. ఇక ముందు దాతలు ఎవరైనా ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది.



రగ్బీ క్రీడాకారిణి పాల్తి అఖిల, కబడ్డీ క్రీడాకారిణి నందు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో..

తిరుమలగిరి మండలం తునికినూతల తండాకు చెందిన కొర్ర హీరా, బుజ్జి దంపతుల కుమార్తె కొర్ర నందు మండలంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో చదువుతుంది. విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ రాష్ట్రస్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో ముందు మరిన్ని విజయాలు సాధించేందుకు శ్రమిస్తున్నట్లు పేర్కొంది.



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

అందరి ప్రోత్సాహంతో..

గుర్రంపోడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆటల పోటీల్లో రాణిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. మైనార్టీ సొసైటీ పరిధిలో జరుగుతున్న ఆటల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ సంవత్సరం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో మైనార్టీ కళాశాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రతిభ కనబర్చారు. గతేడాది అండర్-19 విభాగంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సాయిమనోజ్ ఎంపికయ్యాడు. జనవరి 24, 2024 నుంచి 28 జనవరి వరకు జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చి కళాశాలకు గుర్తింపుతెచ్చాడు. సెప్టెంబరు 23న జరిగిన మండలస్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు కబడ్డీ అండర్-17 విభాగంలో మొత్తం జట్టు 10 మందికి ఆరుగురు ఈ పాఠశాల నుంచే ఎంపిక కావడం గమనార్హం. వాలీబాల్ అండర్-17 విభాగంలో మొత్తం జట్టు తొమ్మిది మందికి అయిదుగురు ఇక్కడి వారే ఎంపికయ్యారు. అనంతరం జరిగిన డివిజన్‌స్థాయి పోటీల్లో గుర్రంపోడు మండల వాలీబాల్ జట్టు మొదటి బహుమతి సాధించింది. వాలీబాల్ అండర్-17 విభాగంలో ప్రతిభ కనబర్చి మనోహర్, శివ అనే విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-19 విభాగంలో నితిన్, వెంకటేష్, రాఖీ అనే విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఫయాజ్‌మాలిక్ అనే విద్యార్థి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరికి పీఈటీ, ప్రిన్సిపల్ మహ్మద్ ఫారుఖ్ తరఫున మంచి ప్రోత్సాహం లభిస్తోంది.



జాతీయ జట్టుకు ఎంపికైన సాయిమనోజ్



వాలీబాల్ జట్టుకు ఎంపికైన మనోహర్, శివ

ఫలించిన కల

● పేదింటి యువతికి కానిస్టేబుల్ కొలువు



త్రిపురారం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన అన్నా, చెల్లెలు పోలీసు కొలువులు సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని కంపసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెం గ్రామానికి చెందిన సాలయ్య-జయమ్మ వ్యవసాయ కూలీలు. కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరిని డిగ్రీ వరకు చదివించారు. కుమార్తె నక్క సంధ్య 2017లో డిగ్రీ (బీఎస్సీ) పూర్తి చేసింది.. ఏదైనా ప్రభుత్వ కొలువు సాధించాలనే తపనతో చదువు అయిపోగానే 2018లో ఆమెకు వివాహం జరిపించారు. భర్త ప్రైవేటు ఉద్యోగం..తరువాత ఇద్దరు కుమారులు కలిగారు.. అయినా తన లక్ష్యాన్ని మాత్రం మరవలేదు. కుటుంబ బాధ్యతలు చేపడుతూనే ఉన్న కొద్ది సమయంలోనే పోటీ పరీక్షలకు సిద్ధమైంది. ఉపాధ్యాయురాలు కావాలనే అనుకుంది.. అంతలోనే ఆమె అన్న శ్రావణ్‌కుమార్ 2020 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు.. అప్పటి నుంచి అన్నను స్ఫూర్తిగా తీసుకుంది..2022 సంవత్సరంలో పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ పడటంతో దరఖాస్తు చేసింది.. సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది..

సంకల్పం ఉంటే ఏదీ అడ్డంకి కాదు..

నా చిన్నప్పటి నుంచి మా కుటుంబ కష్టాలు చూస్తూ పెరిగాను. అందుకే ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉండేది.. సంకల్ప బలం ఉంటే పెళ్లి, కుటుంబం బాధ్యతలు ఏదీ అడ్డంకి కాదు.. నిరంతర శ్రమతో పాటు కుటుంబ సభ్యుల సహకారంతో నాకలను నెరవేర్చుకున్నాను.. -సంధ్య, కానిస్టేబుల్

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

దేవరకొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని వాసవీ క్లబ్ దేవరకొండలో ఆధ్వర్యంలో ఆది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్లబ్ అధ్యక్షుడు నీల భిక్షమయ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీదెళ్ల వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు వాస వెంకటేశ్వర్లు, సముద్రాల ప్రభాకర్, ఆంజనేయులు, సత్యం, రమేష్, నీల సంజీవకుమార్ పాల్గొన్నారు.



శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వసతులు కల్పిస్తాం

▶▶ ఎమ్మెల్యే బాలునాయక్ ▶▶ పెంచికల్‌పహాడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పెంచికల్‌పహాడ్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత దాదికాలంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల విద్యుత్ సమస్య తీరిందన్నారు. తాగునీరు, మౌలిక సదుపాయాలు, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్, పున్న వెంకటేశ్వర్లు, హనుమంతు వెంకటేష్‌గౌడ్, విద్యుత్ డీఈ విద్యాసాగర్, ఏడీఏ సైదులు, ఏఈ రాజేష్, పీఆర్‌డీఈ లింగారెడ్డి, ఏఈ శంకర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే



మాలధారులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తున్నదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన పూజ, అన్నదానం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాములకు అన్నప్రసాదం అందజేయడంలో సహకరిస్తున్న దాతలకు దేవుడి అనుగ్రహం కలుగుతుందన్నారు. సోమవారం నిర్వహించే కలశ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గుడిపాటి నవీన్, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

మద్దిమడుగుకు బయల్దేరిన హనుమాన్ మాలధారులు



హనుమాన్ హోమం చేస్తున్న భక్తులు.

చింతపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లిరాంనగర్, మాల్‌కు చెందిన ఆంజనేయ మాలధారులు ఆదివారం ఇరుముడితో మద్దిమడుగుకు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హనుమాన్ గాయిత్రి హోమం నిర్వహించి 41 రోజులు మండల దీక్ష చేసుకున్న స్వాములకు గురుస్వామి ఇరుముడి ధరించారు. దీంతో గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమంలో గురుస్వాములు కృష్ణ, తిరుమలేష్, గోవింద్‌రాజ్, యాదగిరి, సత్యం, మాజీ సర్పంచి పడకంటి కవితాశేఖర్ గౌడ్, పాల్గొన్నారు.

వ్యర్థాలెక్కువ.. స్థలం తక్కువ

● మిర్యాలగూడలో కష్టతరంగా డంపింగ్ యార్డు నిర్వహణ
● మరో చోటికి మార్చేందుకు యత్నాలు

కుప్పలుగా వ్యర్థాలు.. గుప్పుమంటూ పొగలు, ముక్కుదిరే దుర్గంధం ఇదీ.. మిర్యాలగూడ డంపింగ్ యార్డు దుస్థితి. పట్టణ జనాభా లక్షన్నరకు చేరుకోగా ఆవాసాల సంఖ్య 22 వేల 600లకు పెరిగింది. దీంతో ఇళ్లు, వ్యాపార కేంద్రాల నుంచి నిత్యం 50 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం పట్టణంలోని ఈదులగూడలో ఆరున్నర ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో అంత పెద్దమొత్తంలో వెలువడుతున్న వ్యర్థాలకు సరిపోవడంతో సమస్య తీవ్రమవుతోంది.

(మిర్యాలగూడ టౌన్ - ఆంధ్రజ్యోతి)

మిర్యాలగూడ డంపింగ్ యార్డు కారణంగా ఈదులగూడ, రాంనగర్ బంధం, గూడూరు కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. యార్డులో గుట్టలుగా ఉన్న వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో వెలువడుతున్న పొగ చుట్టుపక్కల కాలనీ వాసులను ఇబ్బందికి గురి చేస్తోంది. డంపింగ్ యార్డును మార్చాలంటూ ఆయా కాలనీల ప్రజలు పలుమార్లు మునిసిపల్ అధికారులకు వినతిపత్రాలు అందించడంతో పాటు ఖమ్మం రహదారిపై రాస్తారోకో నిర్వహించిన సందర్భాలున్నాయి.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

చెత్త నుంచి బంగారం తీస్తామంటూ ప్రచారం చేసిన మునిసిపల్ అధికారులు కనీసం ఎరువును కూడా తీయలేని పరిస్థితి పట్టణంలో ఉంది. కొంతకాలం ప్రైవేట్ ఏజెన్సీకి (ఎరువు తయారు చేయడం) పనులు అప్పగించారు అధికారులు. అయితే పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేరుగా అందించకపోవడంతో వ్యర్థాలను వేరు చేసేందుకు తిప్పలు పడ్డారు. అనుకున్న మేర ఎరువు తయారు కాకపోవడంతో సదరు పనులు వదిలేసి వెళ్లారని అధికారులు తెలిపారు. దీంతో డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్డు నిరుపయోగంగా మారింది.



మిర్యాలగూడ డంపింగ్ యార్డులో చెత్త కుంపలు

బయోమైనింగ్ విధానం అమలుకు చర్యలు

డంపింగ్ యార్డులో బయోమైనింగ్ విధానం అమలుకు చర్యలు చేపట్టారు మునిసిపల్ అధికారులు. వ్యర్థపదార్థాల నుంచి విలువైన లోహాలను సేకరించేందుకు సూక్ష్మజీవులను ఉపయోగించే ఈ ప్రక్రియను రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీలలో ఇప్పటికే అమలు చేస్తున్నారు. ఆధునికమైన ఈపద్ధతితో పర్యావరణానికి ఎటువంటి హాని కలగకపోగా దుమ్ము, ధూళి, పొగ వెలువడటం లాంటి ఇబ్బంది ఉండదు. ఇటీవల యార్డులో పర్యటించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బయోమైనింగ్ విధానం గురించి సంబంధిత అధికారులతో చర్చించారు.

జనాభా పెరుగుతుండటంతో..



ప్రస్తుత డంపింగ్ యార్డు ఇరవై ఏళ్ల క్రితం ఏర్పాటు చేసింది. పట్టణ జనాభా పెరుగడంతో వ్యర్థాలు అధికమవుతున్నాయి. చాలీచాలని స్థలంలో టన్నుల కొద్దీ చెత్తను డంప్ చేయడం ఇబ్బందిగా ఉంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 20 ఏకరాల స్థలంలో నూతన డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అందుకు రెండు, మూడు స్థలాలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాం.

- వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్థలమే ప్రధాన సమస్య



డంపింగ్ యార్డులో ప్రధాన సమస్య స్థలమే. వెలువడుతున్న వ్యర్థాలకు అనువైన స్థలం ప్రస్తుత యార్డులో లేదు. యార్డు ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు లేఖ రాశాం. అప్పటి వరకూ బయోమైనింగ్ విధానంలో నిపుణులతో చెత్తను వ్యర్థాలను ధ్వంసం చేస్తాం. ఈ విధానంతో దుర్వాసన రాదు. కాలుష్యం వెలువడదు. నూతన సంవత్సరంలో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ఎండీ. యూసుఫ్, మునిసిపల్ కమిషనర్

ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలి



చింతపల్లిలో దత్తాత్రేయ హోమం నిర్వహిస్తున్న చైర్మన్ ధనుంజయ్య

దేవరకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని, భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని షిర్డీ సాయి సమాజ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమైనంపాటి ప్రసాద్ అన్నారు. దత్త జయంతి వేడుకలో భాగంగా స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన దత్తాత్రేయ హోమం, భగవద్గీత పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనం చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే బాలునాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు ఇల్లందుల శ్రవణ్‌కుమార్, దొడ్డి సుధాకర్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, దొడ్డి అశోక్, జనార్దన్, వెంకటచారి, మహిళ భక్తులు పాల్గొన్నారు.

● చింతపల్లి,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, స్వస్తిపుణ్యావాచనం, అఖండ దీపారాధన, దత్తత్రేయ హోమం, సామూహిక సత్యనారాయణ, వ్రతం కన్నుల పండువగా చేశారు. కార్యక్రమానికినల్లగొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, మాచర్ల, పిడుగురాళ్ల, హైదరాబాద్ నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుజయ్య, కోశాధికారి పూరె కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కార్యవర్గ సభ్యులు కుంభం పుల్లారెడ్డి, గోషాల ఇన్‌చార్జి తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.

18న అయ్యప్ప మహాపడి పూజ

చింతపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల అయ్యప్ప ఆలయంలో ఈ నెల 18న 18వ అయ్యప్ప మండల మహాపడిపూజకు సంబంధించి వాల్ పోస్టర్ ఆదివారం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి చైర్మన్ కనిగిరి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గురుస్వాములు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, మల్లోజు జగదీశ్వర్, మట్ట యాదయ్యగౌడ్, పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ జీవితం స్ఫూర్తిదాయకం



పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హాలియా, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారత తొలి ఉప ప్రధాని, సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్ అన్నారు. వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాటాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో వేమా సత్యనారాయణ, కందుల మల్లిఖార్జునరావు, మల్లెల ధర్మారావు, సంకుసత్యనారాయణ, కందుల రాంబాబు, కందుల విశ్వేశ్వరావు, తిరుపతయ్య, అమ్మిశెట్టి నర్సింహారావు, శ్రీనివాస్ రావు, కందుల కళ్యాణ్, ఐలా ధనుంజయ్ పాల్గొన్నారు.

కేజీబీవీ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ఉమాదేవి బదిలీ

శాలిగౌరారం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఉమాదేవిని పెద్దఅడిశర్లపల్లి కేజీబీవీ స్కూల్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఈవో బొల్లారం బిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దఅడిశర్లపల్లి కేజీబీవీ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ఎస్.ప్రవళికను శాలిగౌరారం బదిలీ చేశారు.

బస్సు ఢీకొనిశివాలయ ఆవు మృతి

అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్థులు

కేతేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని శివాలయానికి చెందిన ఆవు మృతి చెందింది. ఈ సంఘటన కేతేపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి పట్టనంలోని శ్రీ శంభులింగేశ్వర దేవాలయ కమిటీ గోమాతను పెంచుతున్నారు. నిత్యం గ్రామంలో తిరిగే గోమాతను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పూజిస్తుంటారు. ఈ నెల 12వ తేదీన గురువారం సాయంత్రం గ్రామ నడిబోడ్డున గోవు జాతీయ రహదారిని దాటుతుండగా విజయవాడ వైపునకు వెళ్తున్న ఓ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిని గోవుకు వైద్య చికిత్సలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోమాతకు శివాలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆదివారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో అంత్యక్రియలను నిర్వహించారు. గోమాతను ట్రాక్టర్‌పై అంతిమయాత్ర నిర్వహించి గ్రామశివారులో హిందూ సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.